తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
14 డిసెంబరు, 2025









# గుండెలు హ్యాక్.. సైబర్ షాక్!

# లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్?




దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్క్ సృష్టించుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు తెలుగులో ఓ స్ట్రెయిట్ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో ఆయన ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. కన్నడలో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించనున్నట్లు సమాచారం.

‘ఖైదీ’, ‘విక్రమ్’ వంటి చిత్రాలతో గ్యాంగ్‌స్టర్ డ్రామాలను కొత్తగా ఆవిష్కరించిన లోకేశ్, ప్రస్తుతం రజనీకాంత్‌తో ‘కూలీ’ సినిమా చేస్తున్నారు. దీని తర్వాత రజనీకాంత్-కమల్‌హాసన్ కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ చేస్తారని వార్తలు వచ్చాయి. అయితే, తాజా సమాచారం ప్రకారం లోకేశ్ ఆ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి, పవన్ కల్యాణ్‌తో సినిమా చేసేందుకే ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు. ఈ సినిమాలో నటించేందుకు పవన్ కూడా సుముఖంగా ఉన్నారని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది.

ప్రస్తుతం పవన్ నటిస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా తర్వాత ఆయన మరో ప్రాజెక్ట్‌కు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఆయన తదుపరి చిత్రం లోకేశ్ దర్శకత్వంలోనే ఉంటుందన్న ఊహాగానాలకు బలం చేకూరుతోంది.

అయితే, ఈ వార్తలపై స్పష్టత రావాలంటే నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

తారాతీరం

# కీలక పాత్రలో రేణుదేశాయ్

చాలా కాలం తర్వాత ‘టైగర్ నాగేశ్వరరావు’ సినిమాతో రీ-ఎంట్రీ ఇచ్చిన నటి రేణు దేశాయ్ తన కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ‘పదహారు రోజుల పండుగ’ అనే చిత్రంలో నటిస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇటీవల ఆధ్యాత్మిక యాత్రలతో వార్తల్లో నిలిచిన ఆమె, ఇప్పుడు మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది.



ఈ చిత్రంతో ప్రముఖ నిర్మాత డీఎస్ రావు తనయుడు సాయికృష్ణ దమ్మాలపాటి హీరోగా పరిచయం అవుతున్నారు. 2008లో నితిన్ నటించిన ‘ద్రోణ’ సినిమాలో ఉత్తమ బాల నటుడిగా సాయికృష్ణ నంది అవార్డు అందుకున్నారు. ఈ సినిమాలో గోపికా ఉద్యన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ‘కేరింత’, ‘ఆపరేషన్ గోల్డ్ ఫిష్’ వంటి చిత్రాలను తెరకెక్కించిన సాయికిరణ్ అడవి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తుండగా.. సురేశ్ కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రేణుదేశాయ్, అనసూయతో పాటు కృష్ణుడు, వెన్నెల కిషోర్, విష్ణు వంటి వారు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఆదివారం వార్త

14 డిసెంబరు, 2025

## మంచి ముత్యాలు

– చావు బతుకులు ఎక్కడో లేవు. బలంలోనే బతుకు వుంది. బలహీనతలోనే చావు ఉంది. – స్వామి వివేకానంద

– సుఖంగా మరణించాలంటే చాలా ఖర్చవుతుంది. – శామ్యూల్ బట్లర్

## కదంబం


'సంఘీ'భావం....5

సినీ పరిశ్రమకు పైరసీ బెడద

కవర్ స్టోరీ..6

గుండెలు హ్యాక్..

సైబర్ షాక్!

ఈ వారం కవిత్వం.. 11

నీ చిరునవ్వు ఒక్కటే!

ఆరోగ్య సంరక్షణలో

వేరబుల్ టెక్నాలజీ.. 15

కథ..20

మహోన్నత ఆశయం

ఇంకా...

మొగ్గ

వాస్తు

పుస్తక సమీక్ష

వారఫలం

వగైరా.. వగైరా..


## సమాచారం

### బల్లులు కనిపించని దేశాలు

సాధారణంలో ప్రతి ఇంట్లో ఎప్పుడో ఒకప్పుడు బల్లులు కనిపిస్తూనే ఉంటాయి. వాటివల్ల మనకు ఎలాంటి హాని లేకపోయినా చాలామంది బల్లులను చూసి భయపడుతుంటాం. అయితే కొన్ని దేశాల్లో బల్లులే వుండవంటే ఆశ్చర్యం వేస్తుంది.

**గ్రీన్‌లాండ్:** గ్రీన్‌లాండ్ తీవ్రమైన శీతల ప్రాంతం అయినందువల్ల ఇక్కడ బల్లులు జీవించడానికి అనువైన పరిస్థితులు లేవు. అందువల్ల గ్రీన్‌లాండ్‌లో బలులలు, పాములు, కప్పలు మొదలైనవి కనిపించవు.

**ఐస్‌లాండ్:** అగ్నిపర్వతాలు, నీటి బుడగలు, పచ్చిక బయళ్లు, జలపాతాలతో సుందరంగా ఉండే ద్వీపమిది. సాహస పర్యాటలను ఆకట్టుకుంటుంది. సరీసృపాలు, ఉభయచరాలు జీవించడానికి అనువైన వాతావరణం ఉండదిక్కడ. అందువల్ల ఇక్కడ బల్లులు ఉండవు.

**ఐర్లాండ్:** యూరప్‌లోని ఐర్లాండ్ సైతం బల్లులు లేని దేశంగా పేరు గాంచింది. యూరప్ ఖండం నుంచి ఐర్లాండ్ వేరుపడి ఐలాండ్‌గా మారింది. యూరపనభూభాగం నుంచి బల్లులు, పాములు వలస రాకముందే ఐర్లాండ్ విడిపోవడంతో ఇప్పటికీ అకనకడ బల్లులు, పాములు కనిపించవు. అయితే బల్లి జాతికి చెందిన ఒక అరుదైన జీవి అరుదుగా కనిపిస్తుందట.

**అంటార్కిటికా:** అంటార్కిటికా ఖండం కూడా ఈ జీబితాలో చేరింది. భూమి పైనే అత్యంత శీతల ప్రాంతం. చల్లని గాలులు వీస్తాయిక్కడ. ఇలాంటి ప్రదేశంలో పెంగ్విన్‌లు, సీల్స్, శీతల ఉష్ణోగ్రతలో జీవించగలిగే సూక్ష్మజీవులు మినహాయించి మరే జీవి ఇక్కడ జీవించలేదు. ఈ క్రమంలో సరీసృపాలు, ఉభయచరాలు ఇక్కడ కనిపించవు.

**న్యూజిలాండ్:** ఇక్కడ సాంకేతికంగా బల్లులు లేవని చెప్పవచ్చు. అయితే ఇక్కడ ఉండే 'టువాటరా' అని జీవి బల్లిని పోలి ఉంటుంది. పాములు కనిపించవు. అవి న్యూజిలాండ్‌కు వలస వెళ్లేలోపే ఆ దేశం ప్రధాన భూభాగం నుంచి విడిపోయి ద్వీపంగా మారింది. ఇక్కడికి పాములును తీసుకురావడం నిషేధం.


మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




### డాక్టర్ని మార్చాను..

"రవీ! నీకు జబ్బు పూర్తిగా నయమయినట్లుంది" అన్నాడు డాక్టరు.

"అవునండీ" అన్నాడు, రవి.

"నేనిచ్చిన మందులు బాగా పని చేసాయన్నమాట"

"కాదండీ, డాక్టర్ని మార్చాను".

### డబ్బులిస్తున్నాంగా!

"గోపీ, తొమ్మిదవ ఎక్కం చెప్పు" అంది టీచర్.

"ఎక్కాలు నన్ను అడగొద్దనే కదా మా నాన్న మీకు ఎక్స్‌ట్రా డబ్బులు ఇస్తున్నాడు"

### చదవాల్సిన పని లేదు

"అమ్మా, వచ్చే జన్మలో నువ్వే నా తల్లివి కావాలి" అన్నాడు కొడుకు.

"ఎందుకురా?"

"చదవకపోయినా కోప్పడవు కదా.. అందుకని"

**- వైదా ఈశ్వరరావు,** విశాఖ

### పొదుపు

ప్రియురాలు: "ఎప్పుడూ నాకు కూల్ డ్రింక్ ఇప్పిస్తావు, కూల్ డ్రింక్ అంటే అంత ఇష్టమా?"

ప్రియుడు: "నిన్ను రెస్టారెంట్‌కి తీసుకెళ్లాలి అంటే నేను పార్ట్ టైమ్ జాబ్ చెయ్యాలి. అందుకే కూల్ డ్రింక్..!"

### పొరపాటున

పోలీస్: డెడ్ బాడీ దగ్గర పసుపు, కుంకుమ దొరికాయి కాబట్టి క్షుద్ర పూజలు చేసి చంపారని డౌట్ వచ్చింది. నువ్వు క్షుద్రపూజలు చేసావా?"

హంతకుడు: నేను కిరాణా వ్యాపారం చేస్తాను.. డెడ్ బాడీ పడేసే సమయంలో పాకెట్‌లోని పసుపు, కుంకుమ ప్యాకెట్లు కింద పడిపోయాయి..!

### క్యూ.. మహిమ

ఎస్.ఐ.: పిక్ పాకెటింగ్ కేసులు ఎక్కువగా ఆ వీధిలోనే జరుగుతున్నాయి.. కారణం ఏంటి?

కానిస్టేబుల్: ఆ వీధిలో గుడి ఉంది. అక్కడ అన్నదానం చేస్తూ ఉంటారు.. లైన్లో నిలబడ్డప్పుడు వెనుక పాకెట్స్‌లో నుండి పర్సులు దొంగతనం చేస్తున్నారు..!

### ఇన్‌స్టాగ్రామ్

టీచర్: ముందు వచ్చిన చెవుల కంటే, వెనుక వచ్చిన కొమ్ములు వాడి అంటారు కదా.. దానికి ఉదాహరణ?

స్టూడెంట్: ముందు వచ్చిన ఫేస్ బుక్ కంటే, తర్వాత వచ్చిన ఇన్స్టాగ్రామ్‌కి బానిసలు కావడం!

**- ఎస్ కె.యాకూబ్ పాషా**




### నా దగ్గరే ఉంది..

"శిష్యా! నీ స్కూటర్ దొంగలు తీసుకెళ్లారు కదా! పోలీస్ కంప్లైంట్ ఇచ్చావా?" అన్నాడు పరమానందయ్య తన శిష్యుడితో.

"లేదు గురూజీ! ఇవ్వలేదు"

"ఎందుకని?"

"స్కూటర్ తాళంచెవి నా దగ్గరే ఉంది కదా!"

### నాన్నకు రాలేదెందుకో!

"కాంతం! మనమ్మాయికి ఈ సంబంధం కన్నా మరో మంచి సంబంధం చూద్దామా? నువ్వేమంటావు?"

"మా నాన్నకి ఈ ఆలోచన రాలేదు.. ఎందుకనో?"

### నీట్‌నెస్ వల్ల..

"నవ్యా, నీకు పరీక్షల్లో ఎన్ని మార్కులు వస్తాయని అనుకుంటున్నావు?" అంది స్నేహితురాలు విజయతో.

"కచ్చితంగా పది మార్కులు వస్తాయి" అంది నవ్య.

"ఎలా చెప్పగలుతున్నావు?"

"పేపర్ నీట్‌గా ఉంటే పది మార్కులట, అందుకే రాసి పాడుచేయలేదు".

### ఓట్ల కోసం

"కాంతం! ఎవడు వాడు? 'నన్ను మర్చిపోవద్దు' అంటున్నాడు నీతో నరుకుతాను" అన్నాడు భూషణం.

"అయ్యో! కార్పొరేటర్ ఎన్నికల్లో నిలబడ్డాడు. అతను ఓటు అడగటానికి వచ్చాడు".

### నేనే చెప్పాను

"కాంతం, మన చిన్నాడు నా దగ్గరకు రావడం లేదు, మాట్లాడడం లేదు.. ఏమైంది?"

"చెడ్డవాళ్లతో మాట్లాడకు, వాళ్ల దగ్గరకు వెళ్లొద్దు" అని నేనే చెప్పాను.

### పార్టీ కదా!

"ఏమండీ! తాగడం మానేసాను అన్నారు కదా!" అంది భర్తతో విజయ.

"నిజమే. కానీ అనిల్‌గాడు తాగుడు మానేశాడని పార్టీ ఇచ్చాడు. అందుకని..." సమాధానమిచ్చాడు భర్త.

### తాకట్టు పెట్టకండి!

"కాంతం, ఇక నుండి నిన్ను బంగారం అని పిలుస్తాను" అన్నాడు భర్త.

"పిలవండి పరవాలేదు, కానీ నన్ను తాకట్టు పెట్టకండి"

**- ఈ.ఎస్.మాధవన్**

## 'సంఘీ' భావం



# సినీ పరిశ్రమకు పైరసీ బెడద

కోట్లు కురిపించే సినీ పరిశ్రమకు పైరసీ బెడద పట్టుకుని పీడిస్తోంది. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి సినిమాను నిర్మిస్తే విడుదల అయిన రోజునే వెబ్‌సైట్లలో పైరసీ వెలువడుతోంది. అది కూడా హెచ్‌డి క్వాలిటీతో రావడం కలవరపెడుతోంది. ముఖ్యంగా పైరసీ చిత్రాలను వెలువరిస్తున్న ఐ బొమ్మ వెబ్‌సైట్ వల్ల సినీ రంగానికి వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఈ సైట్‌ను నిర్వహిస్తున్న రవిని పోలీసులు అరెస్ట్ చేయగలిగారు. ఎక్కడో కరేబియన్ దీవుల్లో నివాసం ఏర్పాటు చేసుకుని తెలుగు చలనచిత్రాలను పైరసీ చేయడం ప్రారంభించాడు. అతనిని పట్టుకోవడం పోలీసులకు సాధ్యం కాదన్న అనుమానాలు వెల్లడయ్యాయి. అయితే అనుకోకుండా హైదరాబాద్‌కు వచ్చిన రవిని పోలీసులు పట్టుకోగలిగారు. అంతేకాకుండా అప్పటికప్పుడు ఐబొమ్మ సైట్‌ను మూసివేశారు. దీనితో చలనచిత్ర రంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. అయితే అనూహ్యంగా ప్రజల నుంచి వ్యతిరేక వెల్లడైంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కేవలం సినిమాలే వినోదాన్ని అందిస్తున్నాయి. రిసార్ట్‌లకు, పబ్‌లకు, టూరిజం స్పాట్‌లకు వెళ్లడానికి డబ్బులేని ఈ కుటుంబాలు కేవలం సినిమా ద్వారా మాత్రమే వినోదంతో పాటు దైనందిన జీవితాల నుంచి కొంత విశ్రాంతిని, ఉపశమనాన్ని పొందుతున్నాయి. కేవలం 30,50 రూపాయలతో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సినిమాలను ఆస్వాదించేవారు. అయితే ఆధునిక సాంకేతిక పెరగడంతో మల్టీప్లెక్స్‌లు వచ్చాయి. దీనితో రెండు తెలుగు రాష్ట్రాల్లో వందలాది సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతపడ్డాయి. అదేవిధంగా పాన్ ఇండియా అని, పూర్తి స్థాయి గ్రాఫిక్స్ అంటూ చిత్ర నిర్మాణ ఖర్చులను నిర్మాతలు పెంచుకుంటూ వెళుతున్నారు. ఈ డబ్బును రాబట్టుకోవడానికి తప్పనిసరిగా మల్టీప్లెక్స్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అదేవిధంగా సినిమా విడుదల అయిన కొన్ని రోజుల వరకూ టికెట్ ధరలను రెట్టింపు చేస్తున్నారు. అధికారికంగా పెంపుదలకు తోడు కొన్ని థియేటర్లలో అదనపు రుసుము కూడా వసూలు చేస్తున్నారు. గతంలో నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం సినిమాకు వెళితే టికెట్లకు రెండు వందల నుంచి మూడు వందల వరకు, ఇంటర్‌వెల్ సమయంలో పాప్‌కార్న్, టీ, కూల్‌డ్రింక్‌లు కొనుగోలు చేసేవారు. దీనితో 4 వందల రూపాయలు పెడితే ఇంటిల్లిపాది వినోదాన్ని పొంది ఇంటికి తిరిగి వచ్చేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. సాధారణ రోజుల్లో మల్టీప్లెక్స్‌లలో కనీస టికెట్ ధర 250 రూపాయలుగా ఉంది. పాప్‌కార్న్‌ను 200 నుంచి 300 రూపాయలకు విక్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్‌లను 150 రూపాయలకు, స్నాక్స్ ఏదైనా 300 రూపాయలు ఉంటోంది. ఈ లెక్కన చూస్తే నాలుగురు సభ్యులు ఉన్న కుటుంబం ప్రస్తుతం సినిమాకు వెళితే రెండు వేల రూపాయల వరకు ఖర్చు అవుతుంది. నెలకు 10 నుంచి 15 వేల రూపాయలు సంపాదించే కుటుంబాలు ఇప్పటికీ చాలా మంది ఉన్నారు. వీరు సినిమాకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే నెట్ కనెక్షన్ పెట్టుకుంటే రోజువారీ టివి ప్రోగ్రాంలు, సీరియల్స్, క్రికెట్ వంటివి చూడటంతో పాటు ఐబొమ్మ వంటి వెబ్‌సైట్లలో సినిమా విడుదల అయిన రోజే చూడగలుగుతున్నారు. అందుబాటులో లేకుండా పోతున్న వినోదం కోసం సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలు ఇలాంటి మార్గాలను ఎంచుకుంటున్నారు. వీరి అవసరాన్ని గుర్తించి ఐబొమ్మ రవి వంటి వారు పైరసీ బాట పడుతున్నారు.

సినిమా నిర్మాణానికి అయ్యే ఖర్చును గణనీయంగా పెంచుకుంటూ వెళుతున్నారు. గతంలో 50 లక్షలతో సినిమాను నిర్మిస్తే ప్రస్తుతం 500 కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధపడుతున్నారు. గతంలో సినిమా వంద రోజులు ఆడితే గొప్పగా చెప్పేవారు. ప్రస్తుతం కేవలం వారం రోజుల్లో రెండు వందల నుంచి మూడు వందల కోట్ల వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి సినిమాల వల్ల వేళ్లపై లెక్కించే కొందరు సినీ హీరోలు, దర్శకులు, నిర్మాతలు మాత్రమే లాభ పడుతున్నారు. ఇటు ప్రజలు అటు సినీ కార్మికులు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సినీ నిర్మాణం సమయంలో ఖర్చులు బ్యాలన్స్ తప్పుతున్నాయి. ఈ ప్రభావం ప్రజలపై పడుతుంది.

ఈ విషయాన్ని సినీ నిర్మాతలు, హీరోలు గుర్తించి తమ వైఖరిని మార్చుకోకపోతే ఐబొమ్మ రవి వంటి వారు పుట్టుకు వస్తూనే ఉంటారు. పైరసీలు చేస్తూనే ఉంటారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# గుండెలు హ్యాక్.. సైబర్ షాక్!

డి.మురళీధర్ అమర్‌నాథ్

సైబర్ నేరాలు నేడు ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద సమస్యగా మారింది. భారత్ సహా అన్ని దేశాలు సైబర్ నేరాల బారినపడి విలవిలలాడుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు. ఈ ఏడాది గత అక్టోబర్ నెల వరకు ప్రపంచ వ్యాప్తంగా 108.9 మిలియన్ల సైబర్ కేసులు (పది కోట్ల 89 లక్షలు) నమోదు కాగా ఇందులో భారత్‌లో నమోదైనవి 20 లక్షలకు పైగానే వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్ష కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు దోచుకుంటుండగా భారత్ నుంచి 22 వేల కోట్ల రూపాయల వరకు వుంటోంది.

సైబర్ నేరాలు గతంలో వున్నట్లుగా ఏదో ఒకటి లేదా రెండు రూపాలకు పరిమితం కాకుండా అనేక రూపాల్లో ఇది విస్తరించి అన్ని రంగాల వారిని పీడిస్తోంది. ఈ నేపథ్యంలో సైబర్ నేరాల నివారణకు సరైన జాగ్రత్తలు పాటించడం, ఉన్నత ప్రమాణాలను అనుసరించడం ఒక్కటే మార్గమని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

సైబర్ నేరాలు అభివృద్ధి చెందిన దేశాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలను కూడా పీడిస్తున్న అంశంగా మారి అన్ని దేశాలకు కొరకురానికొయ్యగా మారింది. గతంలో సెల్‌ఫోన్లలో వచ్చే బహుమతుల మోసాలే అతిపెద్ద సైబర్ నేరంగా చెప్పుకునేవారు. కానీ నేడు అంతకు మించిన నేరాలు అన్ని వర్గాలను హడలెత్తిస్తున్నాయి. పెట్టుబడుల మోసం, మాట్రిమోనియల్ మోసం, విదేశీ వస్తువుల గిఫ్ట్ మోసం, డిజిటల్ అరెస్టు, ఫోన్ల హ్యాకింగ్ ద్వారా వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేసి వారికి తెలియకుండా బ్యాంకుల్లోని నగదును దోచుకోవడం వంటివి పెరిగాయి. వీటికి తోడుగా బ్యాంకుల సర్వర్లను, గేట్ వే పేమెంట్‌లను హ్యాక్ చేసి నిమిషాల వ్యవధిలో కోట్లాది రూపాయలను కాజేయడం, ఆన్‌లైన్‌ల ద్వారా నగదు చలామణి చేసే సంస్థలకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వస్తున్న మెసేజ్‌లు, డేటా ఉల్లంఘనల కేసులు మరిన్ని నేరాలకు బాట వేస్తున్నాయి.

ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్టుల పేరిట అనేక మందిని సైబర్ నేరగాళ్లు టోకరా వేసి పదుల కోట్ల రూపాయలను దోచుకున్న తీరు సంచలనం రేపుతోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలు 200 శాతం పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. సైబర్ నేరాలలో ఎప్పటి నుంచో వుంటూ ఇప్పటికీ నిపుణులకు అంతు చిక్కకుండా వున్న నేరం ఫిషింగ్. ఇంటర్నెట్ వాడుతున్న వారిలో అనేక మంది దీని బారిన పడిన ఉదంతాలు న్నాయి. బ్రిటన్, అమెరికాలో ఈ ఏడాది 50 శాతం మంది వ్యాపారులు సైబర్ నేరగాళ్ల బారినపడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతంలో ఇది 83 శాతంగా వుండేది. గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా డేటా ఉల్లంఘనల నేరాల వల్ల 4.88 మిలియన్ల నష్టం వాటిల్లిందని సైబర్ నే రాల విభాగం చెబుతోంది. ఇదే సమయంలో 236 మిలియన్ రాన్సమ్‌వేర్ సైబర్ దాడులు జరిగాయి. వీటితో పాటు మాల్వేర్ దాడులు కూడా అనేక రంగాలను కలవరానికి గురిచేస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఇంటర్నెట్‌ను వాడాల్సి వుండడం, ఇందులో చాలా మంది తగిన జాగ్రత్తలు పాటించక పోవడం, నిపుణులైన ఐటి సిబ్బంది పర్యవేక్షణ వుండకపోవడం సైబర్ నేరగాళ్లకు ఊతంగా మారిందని సైబర్ నిపుణు చెబుతున్నారు. ఇక సైబర్ నేరాల నివారణకు పటిష్టమైన



భద్రతను కలిగివున్న దేశాలలో పోలాండ్ 90.93 శాతంతో మొదటి స్థానంలో వుండగా ఎస్టోనియా 85.83 శాతంతో రెండవ స్థానంలోనూ, ఉక్రెయిన్ 80.83 శాతంతో మూడవ స్థానంలోనూ లాట్వియా 79.17 శాతంతో నాలుగవ స్థానంలోనూ, బ్రిటన్ 75 శాతంతో ఐదవ స్థానంలో వుంది. భారత్ ఈ విషయంలో 40 శాతంలోపు కూడా లేకపోవడం గమనార్హం.

ఇక సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు ఆసియాలోనే వుండడం గమనార్హం. మొత్తం నేరాల్లో ఆసియాలో 26 శాతం, యూరప్‌లో 24 శాతం, ఉత్తర అమెరికాలో 23 శాతం, మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా దేశాలు 14 శాతం, లాటిన్ అమెరికా 13 శాతం వాటా వుంది. ప్రపంచ వ్యాప్తంగా కలవరపెడుతున్న సైబర్ నేరాలలో డేటా ఉల్లంఘన కేసులు. ఈ విషయంలో చైనా 48.52 శాతంతో మొదటి స్థానంలో వుండగా ఇక్కడ 14,15 లక్షల 7775 కేసులున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జపాన్‌లో 14.23 శాతంతో కోటీ 24 లక్షల 6373 కేసులు, దక్షిణ కొరియాలో 10.07 శాతంతో కోటి 66 లక్షల 9124 కేసులున్నాయి. భారత్ పొరుగు దేశం శ్రీలంకలో 14 లక్షల 40 వేల 432 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరాలకు అడ్డాగా వున్న మియన్మార్‌లో 17 వేల 887 కేసులు, ఇరాక్‌లో 16 వేల 113 కేసులు నమోదయ్యాయి.

ఈ కామర్స్ మోసం వల్ల గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా రిటైల్ రంగానికి 48 బిలియన్ల నష్టం వాటిల్లింది. ఇక ఆన్‌లైన్ చెల్లింపులపై రక్షణ ప్రమాణాలు పాటించకుంటే 2027 నాటికి 343 బిలియన్ల నష్టం కలుగుతుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

భారత్ వరకు వస్తే సైబర్ నేరాలు అనేక రంగాలను కుదేలు చేస్తోంది. 2018లో రెండు లక్షల 8456 కేసులు మాత్రమే నమోదు కాగా 2025 అక్టోబర్ వరకు వచ్చే సరికి ఇది 20 లక్షలకు చేరింది. భారత్‌కు చెందిన 70 శాతం పైగా కంపెనీల రాన్సమ్‌వేర్ దాడిని చవిచూస్తున్నట్లు సైబర్ క్రైం పోర్టల్ నివేదిక చెబుతోంది. భారత్‌లో అత్యంత సాధారణ సైబర్ నేరం ఆర్థిక మోసంగా గణాంకాలు చెబుతున్నాయి. 2020 నుంచి 2024 మధ్య కాలంలో వెలుగు చూసిన మొత్తం సైబర్ నేరాలలో 77 శాతం ఇవే కావడం గమనార్హం.

## డిజిటల్ అరెస్ట్

డిజిటల్ అరెస్టు వరకు వస్తే




భారత్‌లో ఈ ఏడాది అక్టోబర్ నెల వరకు 90 వేల పైచిలుకు కేసులు నమోదవగా వీటి వల్ల రెండు వేల కోట్ల రూపాయలను బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. 2024లో లక్షా 23 వేల 627 డిజిటల్ అరెస్టులకుగానూ 1935.51 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. దీని తరువాత జాబ్ ఫ్రాడ్, ఆన్‌లైన్ ఫ్రాడ్, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్ కేసుల్లో మరో పది వేల కోట్ల రూపాయలు లూటీ అయ్యాయి. వీటికన్నా భిన్నంగా సర్వర్లతో పాటు గేట్ వే పేమెంట్‌లను హ్యాక్ చేయడం ద్వారా యేటా సైబర్ నేరగాళ్లు వెయ్యి కోట్ల రూపాయల వరకు దోచుకుంటున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

ఇందులో ముఖ్యంగా చెప్పాల్సింది బంజారాహిల్స్‌లోని మహేష్ బ్యాంక్ ఉదంతం గురించి. 2022 జనవరి నెలలో ఈ బ్యాంకు సర్వర్‌ను నైజీరియా నుంచి సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి 12 కోట్ల రూపాయలను లూటీ చేశారు. వరుసగా రెండవ శనివారం, ఆదివారం సెలవులు రావడంతో నేరగాళ్లు బ్యాంకు సర్వర్‌లో చొరబడి ఖాతాలను ఖాళీ చేశారు. ఈ కేసులో కొందరు నేరగాళ్లు పట్టుబడినా దోపిడి సొమ్ము మాత్రం లభించలేదు. అంతకుముందు దేశ వ్యాప్తంగా మరో మూడు జాతీయ, సహకార బ్యాంకులు ఇదే తరహాలో లూటీ అయ్యాయి. దీంతో పాటు పలు కార్పొరేట్ సంస్థల గేట్ వే పేమెంట్లు కూడా ఇదే తరహాలో హ్యాక్ చేసిన నేరగాళ్లు కోట్ల రూపాయలను లూటీ చేశారు. ఇక భారత్‌లో సైబర్ నేరాలలో బెంగళూరు నగరం మొదటి స్థానంలో వుండగా, హైదరాబాద్ ద్వితీయ స్థానంలో, ముంబాయి తృతీయ స్థానంలో, ఢిల్లీ నాలుగు, లక్నో ఐదవ స్థానంలో వుంది. సైబర్ నేరాలకు సంబంధించి నేరగాళ్లపై ఛార్జిషీట్ల దాఖలులో ఈశాన్య రాష్ట్రం మిజోరం వంద శాతంతో దేశంలోనే అగ్రభాగాన నిలిచింది. ఉత్తరాదితో పాటు దక్షిణాది రాష్ట్రాల నగరాలు ఈ విషయంలో బాగా వెనుకబడ్డాయి.

సైబర్ నేరాలకు అడ్డాగా వున్న రష్యా, తరువాతి స్థానాల్లో ఉక్రెయిన్, చైనా, అమెరికా సైబర్ నేరాల పేరు చెప్పగానే అందరు గోల్డన్ ట్రయాంగల్‌గా పిలిచే మియన్మార్, వియత్నాం, కాంబోడియా దేశాల పేర్లే అందరికి గుర్తుకు వస్తాయి. ఆసియా దేశాలు ముఖ్యంగా భారత్‌లో జరిగే 90 శాతం సైబర్ నేరాలకు గోల్డన్ ట్రయాంగల్ దేశాలే కీలకంగా



వున్నాయని పోలీసు గణాంకాలు చెబుతున్నాయి.

గోల్డన్ ట్రయాంగల్ దేశాలను మించి సైబర్ నేరాలు జరిగేది రష్యా దేశం కావడం గమనార్హం. వరల్డ్ సైబర్ క్రైం ఇండెక్స్ 2024 అనే సంస్థ విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం ప్రపంచంలో జరిగే సైబర్ నేరాలకు మూలాలు రష్యాలోనే వున్నాయి. రష్యాలో పేరుమోసిన సైబర్ నేరగాళ్లు వున్నారని, వీరంతా ఎక్కడికి ప్రయాణించకుండా కేవలం వున్నచోటు నుంచే నేరాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలను కొల్లగొడుతున్నారని వరల్డ్ సైబర్ క్రైం ఇండెక్స్ 2024 వెల్లడించింది.

రష్యా తరువాత సైబర్ నేరాలకు మూలాలు వున్న దేశం ఉక్రెయిన్‌గా ఆ సంస్థ పేర్కొంది. దీని తరువాత చైనా, అమెరికా, నైజీరియా, రొమేనియా దేశాలు సైబర్ నేరాలకు, బడా సైబర్ నేరగాళ్లకు సురక్షిత స్థావరాలుగా వున్నాయి. ఈ దేశాలలో వుండే బడా సైబర్ నేరగాళ్లు ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన సైబర్ నేరగాళ్లతో దోస్తీ వుండడం విశేషం. 2022 జనవరిలో హైదరాబాద్‌లోని మహేష్ బ్యాంకులో వెలుగు చూసిన సైబర్ క్రైంలో మూలాలు నైజీరియా, రష్యాలో వెలుగు చూడడం గమనార్హం. ఈ కేసులో సైబర్ నేరగాళ్లు 12 కోట్ల రూపాయల నగదును కాజేయడం అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. మహేష్ బ్యాంకు సర్వర్‌లో చొరబడి తెలివిగా బ్యాంకులోని కీలక సమాచారాన్ని చోరీచేసి దీని ఆధారంగా నగదును కాజేయడం బ్యాంకింగ్ రంగాన్ని షాక్‌కు గురి చేసింది. ఈ కేసులో కొందరు నేరగాళ్లు పట్టుబడినా అసలైన నేరస్తులు ఇప్పటికీ చిక్కకపోగా పోయిన నగదు కూడా తిరిగిరాలేదు.

గ్లోబల్ సైబర్ క్రైం నివేదిక ప్రకారం 2025 నాటికి ప్రపంచ దేశాలు సైబర్ భద్రతకు పది ట్రిలియన్ డాలర్లు (సుమారు 300 కోట్ల రూపాయలు) ఖర్చు చేయాల్సి వుంటుంది. ఇదే సమయంలో ప్రపంచ దేశాలు సైబర్ నేరాల నివారణలో సమన్వయంగా మెలగుతూ నేరగాళ్ల సమాచారంతో పాటు కొత్త తరహా నేరం జరిగిన వెంటనే ఇతర దేశాలకు దీనిపై సమాచారం అందించి ఆయా దేశాల్లో ఇటువంటివి జరగకుండా జాగ్రత్త పడాల్సి వుంది. గడచిన 11 యేళ్లలో సైబర్ నేరాలు 15.63 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు సైబర్ నేరాలపై పరిశోధన చేసే స్టాటిస్టా అనే మరో అంతర్జాతీయ సంస్థ పేర్కొంది. 2029 నాటికి ఇది మూడు రెట్లు పెరిగి 47 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆ సంస్థ పేర్కొంది.

సైబర్ నేరగాళ్ల ధాటికి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక కంపెనీలు కృత్రిమ మేధస్సుతో తమ డాటాను భద్రపరుచుకుంటున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన టూల్స్‌ను సమకూర్చుకుంటున్నాయని ఆ సంస్థ పేర్కొంది. అయినప్పటికీ సైబర్ నేరగాళ్ల నుంచి ఆయా కంపెనీలకు పూర్తిగా భద్రత లభించడం లేదని ఆ సంస్థ పేర్కొంది.

## గోల్‌మాల్ సైబర్ నేరాలకు కేరాఫ్‌గా రాజస్తాన్

భారత్‌లో వెలుగు చూస్తున్న సైబర్ నేరాలకు రాజస్తాన్‌లోని రెండు నగరాలు కేరాఫ్‌గా మారాయి. దీంతో పాటు ఢిల్లీ, బెంగాల్, యుపిలోని ఇంకొన్ని నగరాలకు చెందిన కేటుగాళ్లు సైతం అమాయకులను నిండా ముంచేస్తున్న వైనం రోజురోజుకు పెరిగిపోతోంది. లాటరీలు, బహుమతులు, పెళ్లి సంబంధాల పేరిట మోసగాళ్లు.. ఇలా అనేక రకాల సైబర్ నేరాలకు ఈ నగరాలకు చెందిన నేరగాళ్లు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గడచిన రెండేళ్ల వ్యవధిలో ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే ఈ తరహా కేసుల్లో 500 మందికి పైగా



నేరగాళ్లు దొరికిపోవడం గమనార్హం. లాటరీలు, ఖరీదైన బహుమతులు వచ్చాయంటూ.. మోసగాళ్లు చేస్తున్న ఫోన్‌లకు స్పందిస్తున్న కొందరు అత్యాశపరులు లేనిదానికి ఆశపడుతూ ఉన్నదానిని కూడా



పోగొట్టుకుంటూ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్న ఘటనలు నిత్యం వెలుగు చూస్తూనే వున్నాయి.

ఈ తరహా మోసాలపై పోలీసు శాఖ పదే పదే హెచ్చరిస్తున్నా మోసగాళ్ల ఆగడాలు తగ్గకపోగా ఇదే సమయంలో బాధితుల సంఖ్య పెరిగిపోతుండడం విశేషం. ఈ తరహా మోసాలలో కీలక పాత్ర వహిస్తున్న బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం విధించాలని కేంద్ర హోం శాఖ చాలా కాలం క్రితమే నిర్ణయించినా ఆచరణలో ఇది ఇప్పటి వరకు అమలుకాకపోవడం గమనార్హం. ఈ తరహా మోసాలు చేసేవారు ఒకప్పుడు నైజీరియా దేశస్తులు కాగా ఇప్పుడు రాజస్తాన్‌లోని భరత్‌పూర్, జాంతారాతో పాటు ఢిల్లీ, యుపి, బెంగాల్‌లోని కొన్ని నగరాలకు చెందిన కేటుగాళ్లు కావడం విశేషం.

రాజస్తాన్‌లోని భరత్‌పూర్, జాంతారకు చెందిన బడా కేడీలు తమ సెల్‌ఫోన్ నంబర్లు ఇతర నగరాలలో వున్నట్లుగా మాయచేస్తూ ఆయా నగరాలలోని స్థానిక నేరగాళ్లతో మిలాఖత్ అవుతూ మోసాలు చేస్తున్న తీరు పోలీసులను సైతం షాక్‌కు గురిచేయసాగింది. ఈ మోసాలకు పాల్పడే నేరగాళ్లు ముందుగా బల్క్ ఎస్ఎంఎస్‌లను దేశ వ్యాప్తంగా లక్ష మందికి ఒకేసారి పంపుతూ అందినంత దోచుకుంటున్నారు. మీకు విదేశీ లాటరీ వచ్చిందని, దీని విలువ కోటి రూపాయలని, ఖరీదైన బహుమతి వచ్చిందని కూడా వుంటుంది. ఈ లాటరీ, బహుమతిని తీసుకోవడానికి కొంత ఖర్చు అవుతుందని అందులో వుంటుంది. ఈ తరహా ఎస్ఎంఎస్‌లను చాలా మంది నమ్మరు. కానీ వేలల్లో ఒకరు దీనిని నమ్ముతూ మోసగాళ్ల చెప్పినట్లుగా నడుచుకుంటారు. దీని తరువాత అసలు మోసానికి తెరలేస్తుంది. మీ లాటరీ లేదా బహుమతి మీకు రావాలంటే ముందుగా మేం చెప్పినట్లుగా ఫలానా బ్యాంకులో కొంత నగదు జమా చేయండని మోసగాళ్లు చెబుతారు. అయితే మోసగాళ్లు చెప్పే బ్యాంకు ఖాతాలు వారివి కావు. వారికి సహకరించే స్థానిక నేరగాళ్లవి కావడం విశేషం. బ్యాంకుల్లో నగదు జమా చేయడం వల్ల ఒకవేళ మోసపోయినా పోలీసులకు ఫిర్యాదు చేస్తే మోసగాళ్లు ఎలాగూ పట్టుబడతారనే ఉద్దేశంతో చాలా మంది వారు సూచించినట్లుగా రాజస్తాన్, ఢిల్లీ, ముంబాయి, ఉత్తరప్రదేశ్‌లోని మారుమూల పట్టణాలలో వున్న బ్యాంకుల్లో నగదు జమ చేస్తారు. ఒకసారి నగదు జమ చేసిన తరువాత మోసగాళ్లు వెంటనే వాటి నుంచి నగదును డ్రా చేసేస్తుంటారు. ఒకసారి నగదు డ్రా చేసుకున్న తరువాత మోసగాళ్లు బాధితులకు మళ్లీ మళ్లీ ఫోన్‌లు చేస్తూ రకరకాల ఖర్చుల పేరిట ఐదారుసార్లు అంతకు మించి నగదు పంపాలని కోరుతూ డబ్బులను తెప్పించుకుంటున్నారు.

ఈ క్రమంలో లాటరీలు, బహుమతుల విలువలను పెంచుతున్నారు. ఇది నిజమని నమ్ముతున్న బాధితులు మోసగాళ్ల చెబుతున్నట్లు ప్రతీసారి 25 వేల రూపాయల నుంచి 30 వేల రూపాయలు పంపుతున్నారు. మొత్తం మీద ఒక్కో బాధితుడి నుంచి మోసగాళ్లు కనీస పక్షంలో ఐదారు లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తూ ఆనక సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేస్తూ తప్పించుకుంటున్నారు. ఈ తరహా ఘటనలపై వస్తున్న ఫిర్యాదులపై పోలీసులు కొంత అసహనంగా వున్నా చివరకు చేసేదిలేక కేసులు నమోదు చేస్తూ రాజస్తాన్‌లోని జాంతార, భరత్‌పూర్‌తో పాటు ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా నగరాలలో వుంటున్న నేరగాళ్లను అరెస్టు చేస్తున్నారు. వారిని ఇక్కడికి తీసుకువస్తూ జైళ్లకు తరలిస్తున్నారు. అయితే వారి వద్ద నయాపైసా కూడా లేకపోవడంతో పోలీసులు బాధితులకు ఎలాంటి సహాయం చేయలేకపోతున్నారు.

ఇక పెళ్లి సంబంధాల పేరిట మోసాలు చేసేవారు మరింత రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా భార్యలు లేదా భర్తలు చనిపోయి లేదా వారికి దూరంగా వుంటూ ద్వితీయ, తృతీయ వివాహాలు చేసుకోవాలనుకునే వారిని ఈ తరహా మోసాలు చేసే నేరగాళ్లు తెలివిగా ఉచ్చులోకి లాగి అందినంత దండుకుంటూ బిచాణా ఎత్తివేస్తున్నారు. మంచి శరీర సౌష్టవం, అందంగా వుండే యువకుల ఫొటోలు మహిళలకు; అందంగా, ఆకర్షణీయంగా వుండే మహిళల ఫొటోలు యువకులకు పంపుతూ వారిని నిండా ముంచుతున్నారు. ఫొటోలను చూసి ఫ్లాట్ అవుతున్నవారు



తమకు ఫోన్ చేసే నేరగాళ్లు కోరినంతా ఇచ్చేస్తున్నారు. చివరకు ఇదంతా గోల్‌మాల్ వ్యవహారమని తెలిసి పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

## విదేశీ ఉద్యోగాలపై మోజుపడే యువతపై సైబర్ నేరగాళ్ల వల

**ఏజెంట్ల మాటలు నమ్మితే అంతే సంగతులంటున్న టిజిసిఎస్‌బి..**

ఉన్నత చదువులు చదివిన యువత మంచి వేతనంతో విదేశాల్లో ఉద్యోగాలు చేసి, తమ కుటుంబాలను సంతోషపెట్టాలని భావిస్తున్న రోజులివి. అయితే ఈ విషయంలో ముందు వెనుక చూడకుండా ఏజెంట్ల మాటలను నమ్మితే సైబర్ నేరగాళ్ల వద్ద బానిసలుగా మారి, నిర్బంధ చాకిరి చేయాల్సి వుంటుందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చరిస్తోంది. ఇటీవల కాలంలో భారత్ నుంచి గల్ఫ్ సహా పలు యూరప్, ఆసియా దేశాలలో బడా కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాల కోసం అంటూ ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోయిన వేలాది మంది ఇప్పుడు భారత్‌కు పొరుగు దేశం సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిన మియన్మార్‌లో నిర్బంధ చాకిరీ చేస్తూ దుర్భరంగా జీవిస్తున్నారని టిజిసిఎస్‌బి అధికారులు చెబుతున్నారు. మియన్మార్ సహా పొరుగునే వున్న కాంబోడియా, లావోస్‌లో వందల సంఖ్యలో సైబర్ నేరగాళ్ల అడ్డాలు వున్నాయని, వీటిలో వేల సంఖ్యలో భారతీయుల చేత బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న విషయం బట్టబయలైందని ఆ విభాగం అధికారులు అంటున్నారు. ముందుగా కొందరు ఏజెంట్లు సోషల్ మీడియా ద్వారా మంచి జీతాలతో విదేశాల్లో ఉద్యోగాలు అంటూ యువతీ, యువకులను ఆకర్షించి వారిని ఆన్‌లైన్‌లోనే ఇంటర్వ్యూ నిర్వహించడం ద్వారా ఏజెంట్లు మోసాలకు శ్రీకారం చుడతారు. అనంతరం తమకు కావలసిన వారిని ఎంపిక చేసుకుని మీకు ఉద్యోగాలు వచ్చాయి అంటూ నమ్మబలికి వారి వద్ద 50 వేల రూపాయల నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేసి చైనా లేదా థాయ్‌లాండ్‌కు తీసుకుపోతారు. ఆ తరువాత ఆయా దేశాలలో ఇక్కడి యువతను అక్కడి ఏజెంట్లు మొదట మర్యాదగానే పలకరించి నాలుగైదు రోజులు బాగానే చూసుకుని ఆ తరువాత పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుంటారు.





అనంతరం యువతీ, యువకులను బలవంతంగా సైబర్ నేరగాళ్ల అడ్డాలకు తరలిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల అడ్డాలకు వెళుతున్న ఇక్కడి యువతకు మొదట ఏమీ అర్థం కాకున్నా వెంటనే అక్కడి నేరగాళ్లు అన్ని విషయాలు చెప్పి మిమ్మల్ని తీసుకు వచ్చింది... సైబర్ నేరాలు చేయించేందుకు. మర్యాదగా మేం చెప్పింది చేయకుంటే అంతు చూస్తాం..” అంటూ బెదిరిస్తారు.

మాట వినని వారిపై భౌతికదాడులు చేస్తున్నారు. దీంతో చేసేదిలేక అక్కడ చిక్కుకున్న యువత బలవంతంగా సైబర్ నేరాలు చేస్తున్నారు. అయితే ఇలా సైబర్ నేరాలు చేస్తున్న వారిలో కొందరు ధైర్యం చేసి తమ బాధలను భారత్‌లో వున్న తమవారికి చెప్పుకోవడం వల్ల అక్కడి నేరాలు వెలుగు చూస్తున్నాయి. ఒక్క భారత్ నుంచే కాకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్ సహా పలు ఆసియా దేశాల నుంచి యువకులకు ఇక్కడికి అక్రమ మార్గాన మియన్మార్‌కు తరలించి వారి చేత సైబర్ నేరాలు చేయిస్తున్నారు.

ఇలా అక్కడ చిక్కుకున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు వందల సంఖ్యలో వున్నారని టిజిసిఎస్‌బి అధికారులంటున్నారు. వీరిని వెనక్కు రప్పించే కార్యక్రమం వేగంగా సాగుతోంది. ఈ క్రమంలోనే ఇక్కడి యువకులను అక్కడికి పంపిన ఏజెంట్లు అరెస్టవుతున్నారు. ఇలా అరెస్టయిన సంపత్ అనే నేరగాడు నిజామాబాద్‌లో ఏడాది క్రితం పోలీసు కస్టడీలో చనిపోవడం సంచలనం రేపింది.

## టామ్ కామ్‌ను విస్తరిస్తే మరింత మేలు

ఇదిలా వుండగా గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందేందుకు ప్రయత్నిస్తున్న వారి కోసం వున్న తెలంగాణ మ్యాన్ పవర్ ఓవర్సీస్ కంపెనీ (టామ్‌కాం)ను మరింత పటిష్టపరిచి ఇతర దేశాలకు కూడా విస్తరించాలని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర సర్కారు ఆధ్వర్యంలో పనిచేసే టామ్ కామ్ వల్ల గల్ఫ్ దేశాలకు వెళుతున్న వారికి ఎన్నో ప్రయోజనాలుండడంతో పాటు మోసగాళ్ల ఆగడాలకు చెక్ పడింది. అయితే సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న వారికి ఇది ఉపయోగపడడంలేదు.

ఈ విషయంలో సర్కారు కేంద్రంతో మాట్లాడి టామ్ కామ్‌ను విస్తరించాలని నిపుణులు చెబుతున్నారు. అప్పటి వరకు విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారు కేంద్రం ఆధ్వర్యంలో పనిచేసే ఇమిగ్రేషన్ వెబ్‌సైట్‌లోని సమాచారం ఆధారంగా ముందుకు వెళ్లాలని టిజిసిఎస్‌బి అధికారులు కోరుతున్నారు.

# సత్యస్పృహ

ప్రభూ!
నేను
రమణీయమైన
ప్రకృతి
అంతులేని అనంత
సృష్టి
ఏదీ శాశ్వతం కాదని తెలుసు
విరామమెరుగని కాలభ్రమణంలో
అన్నీ హరించుకుపోతాయని తెలుసు
అయినా,
ఆశ చావదు.

ఐహిక వాంఛ
తీరదు
కీర్తికాంక్ష తగ్గదు
రాగద్వేషాలు
తొలగవు
మోహావేశాలు వీడవు.
బుద్ధి ఉద్దీపనమై
చిత్తం వేదాంత మథనమై
మనసు అంతర్ముఖమై
అంతా భ్రమయేనని
వింత మాయేనని

అవగతమైతే తప్ప
మనసు నిశ్చలమై శాంతించదు
తృప్తి ఫలమై లభించదు.
ఆనందం అమృతమై ప్రవహించదు

ప్రభూ!
సాక్షి సాదృశ్యమైన
ఈ సత్యస్పృహ
చివరి క్షణం వరకు ఉండేలా
నన్ను అనుగ్రహించు తండ్రీ!

– డా॥ సమ్మన్న ఈటెల

ఈ వారం కవిత్వం



# ఒక మొక్క చాలు..

ప్రకృతి సహజంగా వుంటేనే,
పర్యావరణంలో సమతుల్యం.
పచ్చదనం నిండుగా వుంటేనే,
ఋతువుల ఆగమనం పదిలం.
కాలపథంలో చురుకుగానే
కదలుతుంటాయి ఋతువులు.
పర్యావరణం అస్తవ్యస్థమైతే,

గతులు తప్పి
అపశృతులవుతాయి.
హరించుకుపోతున్నాయి
హరితవనాలు.
నిండుకుంటున్నాయి గ్రీన్
హౌస్ వాయువులు.
పెరిగిపోతున్నాయి
గ్లోబ్‌లో భూతాపాలు.
కరగిపోతున్నాయి మంచుసముద్రాలు.
చొచ్చుకుపోతున్నాయి వడిగాలవనిపై,
దినకరుని యూవి కిరణాలు, వెల్లువై!
చూపుతోంది ప్రభావం
ఓజోన్ పొరపై.

ధరణికి ఆచ్ఛాదం,
ఓజోన్ రక్షణకవచం
అప్రమత్తం కావాలి మనం తక్షణం.
అందంగా అలారారె ప్రకృతికి,
తప్పని కాలుష్య బంధనాలు!
పీల్చే గాలుల్లో
విషవాయువులు.
ఎటు చూసినా
ప్లాస్టిక్ వ్యర్థాలు.
చెట్లు కానరాక ఎడారులైన
భూములు
అందుకే, గతులు మార్చిన
ఋతువులు
ఉద్యమంగా మనం కదలి సాగుదాం
ఒక్కొక్కరం ఒక మొక్కకు ప్రాణం
పోద్దాం.
వృక్షో రక్షతి రక్షితః

– కరణం హనుమంతరావు

# నీతి ఆగ్రహం

ఎడతెరిపిలేని వాన
పచ్చనిపూల ధార
కొమ్మలు గోల గోల
నిన్న చీదరింపు నేలపై
పూల యాత్ర! వాన వెలిసింది
వూరు తలంటి
నేలమీది ప్రవాహంలో
చందమామ యాత్ర!
పిల్లాడు బెంగ...
ఈదురుగాలి, వర్షాలకేం
వచ్చాయి, వెళ్లాయి
గూడు కూలి కూలీ
బొమ్మ చేజారి పిల్లడూ
బెంగెట్టుకున్నారు.

– టి.లలితప్రసాద్

# నీ చిరునవ్వు ఒక్కటే!

చికాకులన్ని ఎగిరిపోవటానికి
కన్నీళ్లు ఆగిపోవటానికి
గుండెమంటలను చల్లార్చటానికి
మనం ఉన్నమని భరోసా ఇవ్వటానికి
ఉన్న ఒకే ఒక్క ఆయుధం
నీ చిరునవ్వు ఒక్కటే !
కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్నిచ్చేది
ఎంత భయంకరమైన
రోగాన్నైనా తరిమికొట్టేది
శత్రువుని మిత్రునిగా చేసేది
కలకలం తలిచే మెతుకు నినాదం
నీ చిరునవ్వు ఒక్కటే!

కోపాలను
కొరివిలో
వేసి
తాపాలను
తారజూలో
తూచి
భేదాభిప్రాయాలను తృజింపచేసి
మానవత్వాన్ని చాటే
ఉన్నతమైన ఆత్మయుధం
నీ చిరునవ్వు ఒక్కటే!
స్నేహంతో చెలిమి చేసేది
ప్రేమ పలకరింపునకు ఊపిరి పోసేది
ఆత్మీయుల నడుమ..
ఆనందం పెంచేది
అంతర్లీన గుణసౌందర్య సాయుధం
నీ చిరునవ్వు ఒక్కటే !

– డాక్టర్ పగిడిపల్లి సురేందరు

## సింగిల్ పేజీ కథ

# మా అమ్మ బంగారం!

పొద్దున్న నుండి ఒకటే టెన్షన్ పడుతోంది శ్రావణి.. ఈరోజు తన ఫ్రెండ్స్ తన ఇంటికి వస్తున్నారు. గత సంవత్సరం ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రభుత్వం ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలెట్టింది. దానికి తగ్గట్టు కొత్త ప్రభుత్వం కూడా ఆమె కోరిక మన్నించినట్టు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది.

తన క్లోజ్ ఫ్రెండ్స్‌లో ఒకరు శ్వేత. కాల్ చేసి శ్రావణిని అలర్ట్ చేసింది. తనతో పాటు తన తమ్ముడు కూడా బీటెక్ చదువుతున్నాడు. ఇంకో సం॥ అయితే వాడి ఇంజినీరింగ్ పూర్తి అవుతుంది. తన అన్నతో పెళ్లి జరిపించాలని శ్వేతా పట్టుదలతో ఉందని తెలిసి కొంచం భయపడింది.

...........

శ్వేతతో పాటు, తన క్లాసుమేట్‌లు కొందరు కలిసి ఇన్నోవా కారులో వచ్చారు. అందరిని పేరు పేరున పలుకరించి ఇంట్లోకి ఆహ్వానం పలికింది. కాలేజీ కబుర్లు, అక్కడ జరిగిన విషయాలు మననం చేసుకొని, కొన్ని జోకులు వేసుకుంటూ శ్రావణి అమ్మ పెట్టిన చిరుతిండ్లు తింటూ చివరగా కాఫీ తాగారు.

శ్వేత, శ్రావణిని చూస్తూ గడిపేసింది. శ్రావణి ఇంకా అందంగా కనిపించింది. పెళ్లికి ఒప్పుకుంటే తన అన్నయ్య అదృష్టవంతుడు అనుకుంది.

"శ్రావణిని మా అన్నయ్యకి ఇవ్వండి. వాడు దీన్ని తప్ప ఇంకొకరిని పెళ్లి చేసుకోనంటున్నాడు. వచ్చే నెలలో మంచి ముహూర్తం ఉంది.." అంటూ మనసులో అప్పుడే శ్రావణిని పెళ్లికూతురుని చేసేసింది.

శ్వేత తల నిమురుతూ.. వాళ్ల అమ్మ ఆమెను ఒడిలోకి తీసుకుంది. ఇలా శ్రావణి వాళ్ళ అమ్మ చేసిన పనికి ఏదో కొత్తగా అనిపించింది.. అమ్మ ఇలా ఎన్నడూ దగ్గరికి తీసుకోలేదు.. పొద్దున్న నుండి రాత్రి వరకు పని.. ఫ్రెండ్స్.. ఎప్పుడు తన మంచి చెడ్డలు పట్టించుకోలేదు.. ఆమె ప్రేమ, ఆప్యాయత, ఆదరణ చూసి ఐస్ అయిపోయింది శ్వేత.

"శ్వేతా! ఒకటి చెప్పనా? పెళ్లికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఆడపిల్లవాళ్ళం కదా! అన్నీ చూసుకోవాలి. ఇష్టపడ్డాడు కదా అని పెళ్లి చేస్తే సరిపోతుందా? జీవితాంతం ఏడడుగులు నడిచేది వాళ్లిద్దరే కదా. ఒకరునొకరు అర్థం చేసుకొని, మనస్పర్థలు రాకుండా



చిలుక గోరింకల్లా కలిసి నడవాలి, నలుగురికి ఆదర్శం కావాలి. పెళ్లి అంటే అదొక మధురానుభూతి. మీ లాగే మాదీ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ.

ఆడపిల్లకి కూడా ఆశలు ఉంటాయి కదా. అందుకే శ్రావణికి ప్రభుత్వం ఉద్యోగం వచ్చి, మీ అన్నయ్య, శ్రావణి కలిసి ఒకరు నొకరు అర్థం చేసుకొని ఇంకా భవిష్యత్తులో ఎలాంటి బాధ ఉండదు అని నమ్మకం కుదిరాక పెళ్లి చేద్దాం. అంతవరకు మంచి బిజినెస్ మాన్‌గా మీ అన్నయ్య కూడా ప్రూవ్ చేసుకోవాలి. ఎందుకంటే ఈ రోజుల్లో ఇద్దరూ పనిచేస్తేనే గడిచే కాలం కదా శ్వేతా" అంది.

తల్లి మాటలకు కళ్ళు పెద్దగా చేసి శ్రావణి తల్లీ బుగ్గలు ముద్దాడింది. మా అమ్మగా పుట్టి వుంటే ఎంత బాగుండేది అంటీ! అనుకుంటూ లేచింది శ్వేత.

అంతలో "శ్వేతా! నేను ఒకటి చెప్పనా? ఏమనుకోకు.. నీవు అమెరికా వెళ్లి ఏం చదువుకుంటావు?. ఇప్పుడు పరిస్థితులు బాగాలేవు. నువ్వు కూడా శ్రావణితో పాటు గవర్నమెంట్ ఉద్యోగం కోసం ప్రయత్నం చెయ్యి. మా అక్క కొడుకు ఈ మధ్యనే గ్రూప్ 1 ఉద్యోగంలో చేరాడు. ఎప్పుడో నిన్ను చుసాడట. వాడే ప్రపోజ్ చేసాడు. నీకు, శ్రావణికి ఉద్యోగం రాగానే మీ ఇద్దరికీ పెళ్లి చేసే బాధ్యత నాదే" అనగానే- శ్వేతా ఆమె మాటలకు తల ఊపి శ్వేత, శ్రావణి వాళ్ళ అమ్మ మాటలతో ఏకీభవిస్తూ- శ్రావణికి హగ్ ఇచ్చి తన ఫ్రెండ్స్‌తో కారులో ఎక్కి కూర్చొని టాటా చెప్పింది.

ఇది కలో నిజమో తెలియక శ్రావణి ఆమె అమ్మ శ్వేతకి నచ్చచెప్పిన తీరు, శ్వేతని తనతో పాటు ఎగ్జామ్స్ రాయమని ప్రోత్సహించడం, తను పడ్డ టెన్షన్ అంత తీసేసి, ఎన్నో మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ- ఆమె అమ్మను దగ్గరికి తీసుకొని ముద్దు పెడుతూ "మా అమ్మ బంగారం!" అంటూ ఆట పట్టిస్తూ రేపటి భవిష్యత్తు ఊహించుకుంటూ మధ్య మధ్యలో శ్వేత అన్నయ్య రూపాన్ని ఊహించుకొని, అతని అల్లరి తలచుకుంటూ తన ఉద్యోగ ప్రయత్నంలో పడిపోయింది శ్రావణి.

అంతలోనే సూర్యుడు చెట్ల చాటు నుండి తొంగిచూస్తూన కిలకిల నవ్వుకున్నాడు ఆమెలోని ఆనందం, పట్టుదల చూసి.

- కొండా రవీందర్

# ఒత్తిడి యమ డేంజర్!

**ఇప్పటి సమాజంలో కొందరు యువకులు, మధ్య వయస్సుల వారు కూడా గుండె పోటుతో చనిపోతున్నారు. డ్యాన్స్ చేస్తూ చనిపోయినవారు, నడుస్తూ కుప్పకూలినవారు, బస్సులో ప్రయాణిస్తూ చనిపోయినవారు ఉన్నారు.**

వీరిలో ఎలాంటి దుర్వ్యసనాలు లేనివారు కూడా ఉన్నారు. అయితే ఇలాంటి వార్తలు చూసినప్పుడు పలువురు కాల మహిమ అంటారు తప్ప కారణం గురించి ఆలోచించరు. దీనికి జీవనశైలి ప్రధాన కారణమని నిపుణులు చెపుతున్నారు. జల, వాయు, శబ్ద, మానసిక కాలుష్యం కూడా మూలం అంటున్నారు. అయితే అన్నీ కలసి ఒత్తిడిని కలిగించి మనిషికి శాపంగా మారుతున్నాయి. మానసిక ఒత్తిడి మన ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా ధ్వంసం చేస్తుంది. ధూమపానం, మద్యపానం, ఇతర వ్యసనాల వల్లే ఆరోగ్యానికి ప్రమాదమని ప్రజలు భావిస్తారు. కానీ ఒత్తిడి వీటన్నింటికంటే ఎక్కువ నష్టం కలిగిస్తుందని నిపుణులు అంటున్నారు.



## మంచిది కాదు

మానసిక వత్తిడి శరీర వ్యవస్థలు అన్నింటినీ ప్రభావితం చేస్తుంది. ఒత్తిడితో కార్టిసాల్ పెరిగి గుండె, మెదడు, జీర్ణకోశం, హార్మోన్లపై నేరుగా ప్రభావం చూపుతుంది. తాగుడు, ధూమపానం ఇతర అలవాట్ల వల్ల ఏదో ఒక ఆర్గాన్ దెబ్బతింటుంది. అయితే ఒత్తిడి వల్ల ప్రతి అవయవానికి నష్టం జరుగుతుంది.

ఒత్తిడి నిశ్శబ్దంగా నాడీ వ్యవస్థను దెబ్బతీసి దీర్ఘకాలిక వ్యాధుల దారితీస్తుంది. మెదడు పనితీరును తగ్గిస్తుంది. దీని వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయ సామర్థ్యం క్షీణిస్తుంది. గుండె సంబంధిత ప్రమాదాలు పెరుగుతాయి. గుండె పోటుకు ప్రధాన కారణాలలో దీర్ఘ కాలిక ఒత్తిడి ఒకటి. ఇది స్మోకింగ్‌తో సమానంగా ప్రమాదకరమని నిపుణులు చెపుతున్నారు.

కాగా ఒత్తిడిలో ఉన్నవారు స్మోకింగ్, డ్రింకింగ్ ఇతర వ్యసనాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతారు. అంటే వ్యసనాలకు ఒత్తిడి మూల కారణంగా మారుతుంది. ఒత్తిడి శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రక్తపోటు పెరుగుతుంది. నిద్ర సమస్యలు తలెత్తుతాయి. జీర్ణ సంబంధిత ఇబ్బందులు కలుగుతాయి. మానసిక ఆందోళన, డిప్రెషన్ పెరుగుతుంది. రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం జరుగుతుంది. డ్రింకింగ్, స్మోకింగ్ అంటే కనిపించే ప్రమాదాలు. ఒత్తిడి అంటే కనిపించని 'స్లో పాయిజన్' అంటారు. అందుకే ఒత్తిడిని తేలికగా తీసుకోకూడదు. శరీరానికీ, మనసుకీ, భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమైనది ఒత్తిడే. ఒత్తిడిని జయిస్తే ఆరోగ్యం, ఆనందం, సుఖమయ జీవితం స్వంతం అవుతుంది.

## నిర్వహణ నేర్చుకోవాలి

మానసిక ఒత్తిడిని నివారించడం అసాధ్యం. అందుకే నిర్వహణ పద్ధతులు నేర్చుకోవాలి. వ్యక్తి శక్తి సామర్థ్యాలను బట్టి లక్ష్యాలు నిర్దేశించుకోవాలి.

## విశ్రాంతి అవసరం

రోజుకు 20-30 నిమిషాలు నడక లేదా తేలికపాటి వ్యాయామం అవసరం. ఆటలు, వ్యాయామాలు యోగ, ధ్యానం ఒత్తిడిని తగ్గిస్తాయి. నిద్ర ఖర్చు లేని ఔషధం అన్న విషయం గుర్తించి రోజుకు ఏడు, ఎనిమిది గంటలు నిద్ర పోవాలి. నిద్ర సమస్యలు ఉంటే వాటిని గుర్తించి అధిగమించాలి. సమస్యలు, సంఘర్షణలు ఎదురైనపుడు పరిష్కార మార్గాలు తెలుసుకోవాలి. పనులు ఎక్కువైనప్పుడు ప్రాధాన్యతా క్రమంలో చేయాలి. అనవసరం అనిపించినవి వదిలిపెట్టాలి.

రోజు పనులను అత్యవసరమైనవి, అవసరమైనవి, వాయిదా వేయాల్సినవి అన్న మూడు భాగాలుగా విభజించాలి. దీనితో ఒకేసారి అన్నీ చేయాలనే ఒత్తిడి తగ్గిపోతుంది. ఆరోగ్యకరమైన పోషక ఆహారం తీసుకోవాలి. టీ, కాఫీ తాగడం తగ్గించాలి. నీరు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. గ్రీన్ టీ, బీట్‌రూట్, బాదం, అరటి ఒత్తిడిని తగ్గిస్తాయి. మానవ, కుటుంబ, స్నేహ సంబంధాలు పెంచుకోవాలి.

ఒత్తిడి ఎక్కువైనా మనసులో పెట్టుకోకుండా నమ్మకమైన వ్యక్తితో మాట్లాడడం మంచిది. అభిరుచులు, ఆసక్తికర అంశాలకు సమయం కేటాయించాలి. జీవన, వృత్తి నైపుణ్యాలు నేర్చుకోవాలి. ఒత్తిడి కనిపించినప్పుడు ఉపశమన పద్ధతులు పాటించాలి.

**- డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి**

# చెట్టు నీడలో..

చెట్టు తత్వం మనిషికి సహనం నేర్పుతుంది. ఒక చిన్న మొక్క పెరిగి పెద్ద చెట్టవ్వడానికి సంవత్సరాలు పడతాయి. ఆ కాలంలో ఎన్ని గాలులు, ఎన్ని వానలు, ఎన్ని రుతువులు దాటుతుందో! అయినా అది పెరుగుతూనే ఉంటుంది. అదే జీవితం తాత్విక పాఠం. ఎదుగుదలకి సమయం అవసరం, సహనం అవసరం. చెట్టు నీడలో కూర్చుని మనం జీవితాన్ని చూసినప్పుడు, కాలం నెమ్మదిగా ప్రవహిస్తున్నట్టనిపిస్తుంది. ఆ శాంతి మనలో ఆత్మవిమర్శను కలిగిస్తుంది. చెట్టు కింద కూర్చుని మౌనంగా ఉంటే మన ఆలోచనల వాన మొదలవుతుంది. ఆ మౌనం తాత్వికతకు మొదటి మెట్టు. ఒక చెట్టు వేళ్ళు భూమిలో దాగి ఉంటాయి; కానీ ఆ వేళ్ళే దాని శక్తి. మన జీవితమూ అంతే. మనకు కనిపించని విలువలే మన బలం. వినయం, దయ, విశ్వాసం.. ఇవి మన జీవన వేళ్లు. బలంగా ఉండాలంటే లోపల బలాన్ని పెంచుకో అని చెట్టు మనకు చెబుతుంది.

పక్షులు చెట్టును ఆశ్రయిస్తాయి, మానవుడు దానిని చూసి సేదతీరతాడు, వాన వచ్చినప్పుడు చినుకులు దానిపై పడతాయి. కానీ చెట్టు ఎప్పుడూ నిశ్శబ్దంగానే ఉంటుంది. ఆ నిశ్శబ్దమే తాత్వికత. మాట్లాడకుండా జీవించడం, ఇవ్వడమే ధర్మంగా భావించడం.. అదే జీవిత గాఢార్థం. చెట్టు ఒక సజీవ ఆత్మ. దానిని కత్తిరించినప్పుడు బాధపడుతుంది, ప్రేమ చూపించినప్పుడు పూలు విరబూస్తాయి. మనిషి కూడా ప్రకృతితో అనుబంధం కలిగి ఉంటే, అతని హృదయం మృదువవుతుంది. మనం చెట్టు చుట్టూ కూర్చుని గాలి విన్నప్పుడు, మనసు లోపల శాంతి తాకుతుంది.. అది ప్రకృతితత్వం.



ఎన్ని విజయాలు వచ్చినా వినయం కోల్పోకూడదు. చెట్టు లాగా మనం కూడా సజీవ సౌందర్యంగా, మౌన సేవకులుగా ఉండాలి. చెట్టు నీడలో మనకు మనమే స్పష్టంగా కనిపిస్తాం. మన ఆలోచనల మబ్బులు తొలగి, మనసు ఒక పచ్చని శాంతితో నిండిపోతుంది. ప్రతి ఆకుపై ఒక తాత్విక పాఠం ఉంటుంది, కానీ దాన్ని చదవడానికి మనసు కావాలి. చెట్టు ఎప్పుడూ ఆకాశం వైపు పెరుగుతుంది, కానీ దాని వేళ్ల ఎప్పుడూ నేలని వదలవు. అదే జీవిత సత్యం. మనం ఎంత ఎదిగినా, మన మూలాన్ని మరిచిపోకూడదు. ఒక చెట్టు నిశ్శబ్దం అంటే ఓపికతో కూడిన తాత్వికత. వర్షం పడనప్పుడు ఫిర్యాదు చేయదు, ఎండను తట్టుకుంటుంది, క్రమంగా తన శక్తిని లోపల నుండి పెంచుకుంటుంది. మనిషి జీవితం కూడా అలానే ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు నిస్పృహ చెందక, లోపల బలాన్ని పెంచుకోవడం నేర్చుకోవాలి.

చెట్టు మనకు శ్రద్ధను నేర్పుతుంది. పక్షుల గూళ్లకు అది ఇంటిలా మారుతుంది, కీటకాలకు అది ఆవాసం అవుతుంది. ఎవరిని తిరస్కరించదు. మనిషి కూడా అలా ప్రేమతో, సమాన దృష్టితో ప్రతి ప్రాణిని స్వీకరించగలగాలి. ప్రకృతిలో ఉన్న సహజ సమానత్వం మన హృదయంలోకి వచ్చినప్పుడు, మనం నిజమైన తాత్వికులు అవుతాం. చెట్టు నీడలో కూర్చుని ఒక చిన్న క్షణం ధ్యానిస్తే, మనసులో ప్రశ్నలు పుడతాయి.. నేను ఎవరు? నేనేమి ఇస్తున్నాను? "ఇవ్వడం జీవితం, ఇవ్వకపోవడం నిశ్శబ్ద మరణం" అని చెట్టు సమాధానమిస్తుంది.

ఒక చెట్టు కింద పది తరాలు గడుపుతాయి; పిల్లలు ఆడుతారు, పెద్దలు విశ్రాంతి తీసుకుంటారు, వృద్ధులు జ్ఞాపకాలు చెబుతారు. కానీ చెట్టు మాత్రం అట్లే నిలబడి ఉంటుంది. అది మనిషికి శాశ్వతత్వం గురించి నేర్పుతుంది. మనం ఎన్ని సార్లు మారినా, మన కర్తవ్య భావం చెట్టులా స్థిరంగా ఉండాలి. చెట్టు కింద పడ్డ ఆకులు కూడా వ్యర్థం కావు. అవి నేలతో కలిసిపోతాయి, మళ్లీ జీవం అవుతాయి. అది ప్రకృతిలోని పునర్జన్మ తత్వం. మన జీవితంలో కూడా ప్రతి విఫలం, ప్రతి బాధ, చివరికి ఒక కొత్త ప్రారంభానికి పునాది అవుతుంది. **చెట్టు మనకు నేర్పే ఈ చక్రం జీవన తత్వానికి ప్రతీక.** పిల్లలు చెట్టు నీడలో ఆడుతుంటే, అది వారికి కవిత్వాన్ని నేర్పుతుంది. ఆ చల్లని గాలి, ఆ కాంతి కదలిక, ఆకుల చప్పుళ్లు.. ఇవన్నీ సహజ సంగీతం. మనిషి ఆ స్వరాన్ని వినగలిగితే అతని మనసు ప్రశాంతమవుతుంది. చెట్టు నీడలో సాహిత్యం పుడుతుంది, ఆలోచన మొలుస్తుంది.

మనసు ఆ చెట్టు నీడలా మారితే, ఎన్ని కష్టాలు వచ్చినా చల్లదనాన్ని కోల్పోదు. మనలో మౌనం పుష్టిగా పెరుగుతుంది. ఆ మౌనం మన బలంగా మారుతుంది. చెట్టు మనకు నేర్పేది అదే సహనం, కృతజ్ఞత, మౌనం. ఇవే జీవన విలువల విత్తనాలు. ఆకాశాన్నంటే ప్రయాణం. కొన్నిసార్లు తుపాన్లు తాకుతాయి, కొన్నిసార్లు మేఘాలు కప్పేస్తాయి. కానీ వేర్లు బలంగా ఉంటే చెట్టు నిలుస్తుంది. మన విలువలు, మన సత్యం, మన దయ.. ఇవే మన వేర్లు. చెట్టు నీడలో తాత్వికం అంటే అదే! మనలోని విలువలతో నిలబడటం, మౌనంగా ఇవ్వడం. చెట్టు మనకు నీడనిస్తే మనం ఈ ప్రపంచానికి ఆలోచనల నీడ ఇవ్వాలి. అదే మనిషి జీవన తత్వానికి పరమార్థం.

– డా॥ చిటికెన కిరణ్ కుమార్

# ఆరోగ్య సంరక్షణలో వేరబుల్ టెక్నాలజీ

వేరబుల్ టెక్నాలజీ అనేది శరీరంపై ధరించగలిగే స్మార్ట్ పరికరాల సముదాయం. ఇవి హృదయ స్పందన, నిద్రా విధానం, రోజువారీ శారీరక చురుకుదనం, భావోద్వేగ స్థితి వంటి కీలక శరీర సంకేతాలను సెన్సర్ల ద్వారా కచ్చితంగా గుర్తిస్తాయి. గడియారం, బ్యాండ్ లేదా ప్రత్యేక దుస్తుల రూపంలో లభించే ఈ పరికరాలు ఇటీవలి సంవత్సరాల్లో ప్రజాదరణతో పాటు సాంకేతికంగా కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

డిజిటల్ విప్లవ ప్రభావంతో, వేరబుల్ పరికరాలు ఇప్పుడు ఆరోగ్య రంగంలో ముఖ్యమైన సాధనాలుగా మారాయి. స్మార్ట్‌వాచ్‌లు, ఫిట్‌నెస్ ట్రాకర్లు, రింగులు, ప్యాచ్‌లు వంటి పరికరాలు శరీరంలోని ఆరోగ్య సూచీలను రియల్ టైమ్‌లో పరిశీలించి, వైద్యులు దూరం నుంచే రోగి ఆరోగ్య స్థితిని అంచనా వేయగలిగే విధానాన్ని మరింత సులభతరం చేస్తున్నాయి. ఆసుపత్రి కేంద్రిత సేవల నుంచి రోగి కేంద్రిత వ్యక్తిగత సంరక్షణ వైపు ఈ టెక్నాలజీ మార్పును నడిపిస్తోంది.

ఈ పరికరాల్లో అమర్చిన సెన్సర్లు చర్మ ఉష్ణోగ్రత, హృదయ స్పందన, రక్త ఆక్సిజన్ స్థాయిలు, నిద్ర ధోరణులు.. వంటి కీలక సమాచారాన్ని నిరంతరం నమోదు చేస్తాయి. ఈ డేటా విశ్లేషణ ద్వారా నిద్రా నాణ్యత, రోజువారీ చురుకుదనం, ఒత్తిడి స్థాయి, శ్వాసకోశ పనితీరు వంటి అనేక ఆరోగ్య అంశాలపై స్పష్టమైన అవగాహన పొందవచ్చు. ఒకప్పుడు కేవలం ఫిట్‌నెస్ కోసం మాత్రమే ఉపయోగించిన ఈ పరికరాలు, ఇప్పుడు చికిత్సా రంగంలోనూ వైద్యులకు సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని అందిస్తూ మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

వేరబుల్ టెక్నాలజీ ఇప్పుడు దుస్తుల్లోకీ విస్తరించింది. 'ఇంటెలిజెంట్ ఫ్యాబ్రిక్స్' లేదా 'స్మార్ట్ ఫ్యాబ్రిక్స్' అని పిలిచే ఈ ప్రత్యేక దుస్తుల్లో సెన్సర్లు నూలు మాదిరిగా నేయబడి ఉంటాయి. ఇవి శరీర ఉష్ణోగ్రత, ఒత్తిడి, హృదయ స్పందన, హైడ్రేషన్ స్థాయి వంటి వివరాలను సహజంగా గుర్తిస్తాయి. క్రీడాకారుల పనితీరును మెరుగుపరచే దుస్తుల నుంచి, వైద్య పర్యవేక్షణ కోసం రూపొందించబడే స్మార్ట్ దుస్తుల వరకూ ఈ రంగం వేగంగా ఎదుగుతోంది. కంపెనీలు, ఫ్యాషన్ రంగం, పరిశోధనా సంస్థలు కలిసి ఈ సాంకేతికతను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్తున్నాయి.

వేరబుల్ టెక్నాలజీలో అత్యంత ప్రాధాన్యం పొందిన ఆవిష్కరణల్లో ఈ-స్కిన్ ఒకటి. ఇది మన చర్మాన్ని పోలి ఉండే, చాలా పలుచని, వంచుకోగలిగే ఎలక్ట్రానిక్ పొర. తేమ, ఉష్ణోగ్రత, పీడనం వంటి సంకేతాలను ఇది సహజంగా గుర్తిస్తుంది. ఈ-స్కిన్ ఆధారిత ప్యాచ్‌లు ఇప్పటి ఫిట్‌నెస్ పరికరాలు, కృత్రిమ అవయవాలు, వైద్య పర్యవేక్షణ వంటి రంగాల్లో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. స్వల్ప స్పర్శతోనే శరీరంలోని ముఖ్య సంకేతాలను కచ్చితంగా గుర్తించగలిగే ఈ సాంకేతికత వలన, రోజువారీ ఆరోగ్య పర్యవేక్షణ మరింత సులభంగా, సమర్థవంతంగా మారుతోంది.

నవజాత శిశు సంరక్షణలో వేరబుల్ టెక్నాలజీ నిజంగా పెద్ద మార్పును తీసుకొచ్చింది. ఎన్.ఐ.సి.యు., పి.ఐ.సి.యు.లలో శిశువులపై ఉపయోగించే సంప్రదాయ వైర్డ్ పరికరాలు చర్మానికి నొప్పి, గాయాలు, అసౌకర్యం కలిగించడం సహజం. ఇప్పుడు వాటి స్థానంలో తేలికైన, వైర్‌లెస్ వేరబుల్ ప్యాచ్‌లు వినియోగంలోకి వచ్చాయి. ఇవి శిశువుల సున్నితమైన చర్మాన్ని హాని చేయకుండా ప్రాణ సంకేతాలను నిరంతరం కచ్చితంగా కొలుస్తాయి. ఈ విధానం వల్ల తల్లిదండ్రులు-శిశువుల మధ్య స్కిన్-టు-స్కిన్ బంధం సులభంగా కొనసాగుతుంది. అందువల్ల వేరబుల్ టెక్నాలజీ కేవలం పెద్దల ఆరోగ్యంపై మాత్రమే కాకుండా, నూతన జీవన సంరక్షణలోనూ ఓ కొత్త మార్గాన్ని చూపుతోంది.



వేరబుల్ టెక్నాలజీ ఆరోగ్య సంరక్షణను మరింత వ్యక్తిగతమైనదిగా, సులభమైనదిగా, కచ్చితమైనదిగా మార్చుతోంది. రియల్ టైమ్ డేటా, నిరంతర పర్యవేక్షణ, వ్యక్తిగతీకరించిన ఆరోగ్య సూచనలతో ఈ పరికరాలు మన రోజు వారీ జీవితంలో ముఖ్యమైన సహచరాలుగా మారాయి. శిశువుల నుంచి పెద్దల వరకు ప్రతి వయసుకీ ఆరోగ్యాన్ని సమగ్రంగా పర్యవేక్షించే సత్తా వీటిలో ఉంది. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందే ఈ టెక్నాలజీ, ఆరోగ్యరంగాన్ని మరింత ఆధునికంగా, సురక్షితంగా మార్చే దిశలో ముందుకు నడిపిస్తోంది.

– డా॥ కృష్ణ కుమార్ వేపకొమ్మ





కథ

# మంచి దారి

విశ్వజిత్ యు.కె.జి. చదువుతున్నాడు. మధ్యాహ్నం కాన్వెంట్ అవగానే ఇంటికి తీసుకొచ్చాడు హేమచంద్ర. తరగతిలో నేర్చుకున్నది అమ్మకు చెప్పాలని సంబరంగా ఇంట్లోకొచ్చాడు విశ్వజిత్. స్వప్న కొడుకుని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంటుంటే, “అమ్మా, అమ్మా... మరే.. మరే.. తొండను ఇంగ్లీష్‌లో ఏమంటారో నీకు తెలుసా?” అని అడిగాడు. “అయ్యో, తెలీదు నాన్నా, నువ్వే చెప్పు” రోజూలానే అడిగింది.

“ఏమంటారంటే.. ఏమంటారంటే.. ‘గార్డెన్ లిజార్డ్’ తనకే తెలుసున్నట్లు గర్వంగా చెప్పాడు.

“వావ్...వెరీ గుడ్. ఇలానే రోజూ ఒకటి నేర్చుకోవాలి. ఒకేనా! వెళ్లి కాళ్లూ, చేతులూ కడుక్కుని రా, అన్నం పెడతాను” మెచ్చుకుంటూ వంటింట్లోకి వెళ్లింది.



తండ్రీ, కొడుకులిద్దరూ కాళ్లూ, చేతులు కడుక్కుని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు. భోజనం వడ్డిస్తుండగా ఫోన్ మోగితే ఎత్తింది స్వప్న. “హలో.. సంకల్ప్‌వాళ్ల మదర్‌నా.. హాయ్ అండి, చెప్పండి!” అంది స్వప్న. “విశ్వజిత్, సంకల్ప్‌కి కోడిగుడ్డు పెట్టాడటండీ! మీరేమైనా బాక్సులో వేసి పంపారా?” అడిగిందామె. “అవునండీ. అది పౌష్టికాహారం కదా. పెట్టమని డాక్టర్లు, టీచర్లు చెప్తున్నారు కదా. అందుకే రోజూ ఉదయమే తినేసి వస్తాడు. ఈరోజు ఆలస్యమైందని బాక్సులో వేసి పంపాను. ఏమైందండీ?” సంకోచిస్తూ అడిగింది స్వప్న. “మీ ఇంట్లో తినమనండి..” అందామె. విషయం అర్థమై, “సరేనండి... ఇకపై జాగ్రత్త పడతాను. ఏమీ అనుకోకండి!” అని చెప్పి కొడుక్కి ఎలా చెప్పాలోనని ఆలోచించింది స్వప్న.

“సంకల్ప్‌కి కోడిగుడ్డు పెట్టావా విశ్వజిత్?” అడిగింది స్వప్న. “నేను తింటుంటే అడిగాడమ్మా. ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకోవాలని నువ్వు చెప్పావుగా, అందుకే పెట్టాను” ఒకప్పుడు అమ్మ చెప్పిన మాటను గుర్తు చేస్తూ బదులిచ్చాడు విశ్వజిత్.

“వెరీగుడ్ నాన్నా.. మంచి పని చేశావ్. అయితే కోడిగుడ్డును, చికెన్‌ను కొంతమంది తినరు. మనం పెట్టకూడదు కూడా” వివరిస్తోంది స్వప్న. “ఎందుకు వద్దంటుందోనని” అమ్మకేసి చూశాడు విశ్వజిత్. “అవి తింటున్నప్పుడు ఎవరైనా చూస్తే దిష్టి తగులుతుంది. సంకల్ప్ మంచి ఫుడ్ తిన్నాడు. అందుకే బలంగా వున్నాడు. నువ్వేమో సరిగ్గా తినవు. బలంగా లేవు. నీకెక్కువ బలం రావాలంటే నువ్వే తినాలి. సరేనా?” అర్థమయ్యేలా చెప్పింది స్వప్న. “సరేనంటూ” తలూపి చేయి, నోరు కడుక్కోవడానికి సింక్ దగ్గరకెళ్లాడు విశ్వజిత్.

“ఎందుకలా చెప్పావు? వాళ్లు ‘ఫలానా’ అని, వాళ్లు నాన్ వెజ్ తినరని చెప్పొచ్చు కదా!” అన్నాడు హేమచంద్ర.

“మొక్కై వంగనిది మానై వంగదని ఊరికే అనలేదు. ఆ ‘ఫలానా’ల గురించి పసివయసులో చెప్పడం ఎందుకండీ? బాక్సులో నాన్ వెజ్ పెట్టకుండా మనమే జాగ్రత్తలు తీసుకోవాలి” సూక్ష్మంగా చెప్పింది స్వప్న. “నిజమే! పిల్లలకు తల్లే ఆదిగురువు. గురువులెప్పుడూ సన్మార్గాన్నే చూపిస్తారు!” అని అనుకున్నాడు హేమచంద్ర.


– దొండపాటి కృష్ణ











## బాలగేయం

### మరువకు

ఆకలేసింది
అమ్మ గుర్తొచ్చింది !
అవసరం పడింది
నాన్న గుర్తొచ్చారు !
బాధగా అనిపించింది
అక్క గుర్తొచ్చింది !
తోడు అవసరమైంది
అన్న గుర్తొచ్చాడు !
ఆపద ఎదురొచ్చింది
అందరు గుర్తొచ్చారు !
సంతోషం నిలదీసింది
ఎవరూ గుర్తుకు రారేమని !
సెలవిచ్చి వెళ్ళింది
ఎవ్వరినీ మరువకని !!

– తిప్పాన హరిరెడ్డి,
విజయవాడ



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**ఎస్.ప్రభు, కాకినాడ**

**ప్రశ్న:తెల్లవారుజామున లేచి చదివితే జ్ఞాపకం ఉంటుందంటారు.. ఇది నిజమేనా?**

**జవాబు:** సూర్యోదయానికి తొంభై నిమిషాల ముందు కాలాన్ని బ్రహ్మీ ముహూర్తం అంటారు. బ్రహ్మ జ్ఞానాధ్యయనాదులకు యోగ్యమైన, రాత్రి కడపటి మాయం నందలి రెండు గడియల కాలాన్ని బ్రహ్మీ ముహూర్తం అని పెద్దలు చెప్పారు. బ్రహ్మీ అంటే సరస్వతి. అంటే మనలోని బుద్ధి, బుద్ధి ప్రబోధం చెందే కాలం కనుక దీనిని బ్రహ్మీ ముహూర్తమన్నారు.

ఈ సమయంలో బుద్ధి నిర్మలంగా ఉండి బాగా వికసిస్తుంది. కనుకనే మన పెద్దవాళ్లు తెల్లవారుజామునే లేచి చదువుకోవాలని చెప్పేవారు. రాత్రిళ్లు త్వరగా నిద్ర పోయి తెల్లవారుజామున నిద్ర లేస్తే ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటారు.

**సి.వాసుకి, నిజామాబాద్**

**ప్రశ్న: జపాన్ భాష చాలా ప్రత్యేకత కలిగి వుంటుందని అంటారు. ఆ ప్రత్యేకత ఏమిటి?**

**జవాబు:** ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో జపాన్ అగ్రస్థానంలో వున్నప్పటికీ ఆ దేశంలో వ్యాపార వ్యవహారాలన్నీ చేతిరాతల మీదే సాగడం విశేషం. జపాన్ భాషలో మూడు రకాల అక్షరమాలలు ఉన్నాయి.

ఒక్కో అక్షర మాలలో నిత్యం ఉపయోగించే సంకేతాలు 1850 వరకు వుంటాయి. ఇన్నింటినీ టైపు చేయడం ఖరీదైన వ్యవహారమే కాక ఖర్చయ్యే సమయం కూడా ఎక్కువ. అందుకే చాలా కంపెనీలు రాతకోతల కోసం ప్రత్యేకించి ఉద్యోగస్తులను నియమించుకుంటారు.





పరమాత్మ స్వయంగా నడయాడిన భారత భూమిలో ప్రతి ఒక్క పురాతన క్షేత్రం విశేష పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉండటం గమనించవలసిన విషయం. మన దేశంలోని మారుమూల ప్రాంతాలలో నెలకొల్పబడిన ప్రతి దేవాలయం తమవైన విశేషాలను మౌనంగా తెలుపుతాయి. అలాంటి మరొక దివ్యక్షేత్రం గురించి తెలుసుకుందాం.

సృష్టికర్త బ్రహ్మదేవుడు తపమాచరించిన ప్రదేశం, పరమేశ్వరుడు స్వయంభూగా అవతరించిన క్షేత్రం, శ్రీ మహావిష్ణువు వరాహ రూపంలో ఏర్పరచిన జల పుడమి మీద సమస్త జీవుల జీవనం అల్లకల్లోలమైనది. దేవతలు వైకుంఠ వాసుని ప్రార్థించారు. శ్రీమన్నారాయణుడు అసురుని సంహరించడానికి వరాహ రూపం ధరించి శరవేగంతో వెళుతున్నప్పుడు పాద ఘట్టనల నుండి ఉద్భవించిన జలప్రవాహమే 'వరాహ నది'గా పిలవబడుతోంది. వైకుంఠవాసుని పాదాల నుండి జనించిన పవిత్ర వరాహ నదీతీరంలో బ్రహ్మదేవుడు తపస్సు చేశారట.

### బలి చక్రవర్తి

శ్రీమన్నారాయణుని ప్రియ భక్తుడైన ప్రహ్లాదుని మనుమడు ఏమిటంటే తాత ప్రహ్లాదుని కాపాడటానికి ఉగ్రనారసింహునిగా అవతరించిన విష్ణువు, మనవడిని దండించడానికి వామన అవతారం ధరించారు. స్థూలంగా బాలి చక్రవర్తి కథ ఇది.

నూరు యజ్ఞాలు చేయాలన్న దీక్షతో వాటిని నిర్వహించడానికి తగిన పవిత్ర ప్రదేశాలను అన్వేషించే క్రమంలో వరాహ నదీతీరం కనిపించింది. బలి చక్రవర్తి భక్తి శ్రద్ధలతో విధాతను ప్రార్థించారట. హంసవాహనుడు ఇక్కడ తపస్సు చేసి కైలాసనాథుని సాక్షాత్కారం పొంది యజ్ఞం చేయడానికి

# బలియజ్ఞం చేసిన స్థలం 'బలిఘట్టం'



ప్రవాహం, బలిచక్రవర్తి యజ్ఞం చేసిన పావన నదీతీరం.. వెయ్యి సంవత్సరాల నాటి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత శ్రీ బ్రహ్మలింగేశ్వర స్వామి కొలువుతీరిన దివ్యధామం అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి సమీపంలో ఉన్న బలిఘట్టం.

### వరాహ నది

బ్రహ్మ మానస పుత్రులైన సనక సనంద, సనాతన, సనత్కుమారు లను అవమానించి శాపం పొందారు వైకుంఠ ద్వారపాలకులైన జయ, విజయులు. శ్రీహరి వారి యందుగల వాత్సల్యంతో ఆయనకు శత్రువులుగా మూడు జన్మల తరువాత వైకుంఠం చేరే అవకాశం ఇచ్చారు. హరి ద్వేషులుగా వారు తమ తొలి జన్మలో హిరణ్యాక్ష, హిరణ్య కశపులుగా జన్మించారు. వర గర్వంతో హిరణ్యాక్షుడు భూదేవిని బంధించి సముద్రగర్భంలో బంధించాడు. విపత్కరమైన ఈ సంఘటన వల్ల ప్రకృతి క్రమం మారిపోయింది.

బలిచక్రవర్తి. ఇతడు ఉత్తమ పాలకుడు, గొప్ప దైవభక్తుడు, దానశీలి. ఎన్నో యజ్ఞయాగాదులు చేసినవాడు. ఇంద్రపదవిని ప్రసాదించే నూరవ యజ్ఞం ప్రారంభించడానికి ముందు పండితులకు, బ్రాహ్మణులకు ధన, కనక, వస్తు, వాహనాలను దానం చేయడానికి సంకల్పించు కొన్నారు.

ఎంతటి గుణశీలుడైనా జన్మతః అసురుడు అయినందువల్ల ఇంద్ర పదవికి అనర్హుడు. ఈ కారణం చేత శ్రీహరి బాల వటువు వామనునిగా వెళ్లారు. మూడు అడుగుల నేల దానంగా కోరి త్రివిక్రమునిగా మారి ముల్లోకాలను కొలిచి బలి చక్రవర్తిని పాతాళానికి పంపారు. విశేషం

ముహూర్త నిర్ణయం చేసి ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించారట. ప్రస్తుతం ఆలయంలో పూజలు అందుకొంటున్న లింగం బ్రహ్మదేవుడు ప్రతిష్ఠించినది అయినందువల్ల శ్రీ బ్రహ్మ లింగేశ్వరునిగా పిలుస్తున్నారు. ఘట్టం అంటే యజ్ఞ గుండము అని అర్థం చెబుతారు. బలి యజ్ఞం చేసిన స్థలం కనుక 'బలిఘట్టం' అని పిలుస్తున్నారు. మరికొన్ని విశేషాలకు నిలయం ఈ దేవాలయం.

### పరమేశ్వర పంచ ముఖ దర్శనం

లింగరూపంలో దర్శనమిచ్చే లింగ రాజుకు పంచ ముఖాలు అని పురాణాలు వివరిస్తున్నాయి. ఈ పంచ ముఖాలు పంచ భూతాలకు, సృష్టి, స్థితి, లయ, తిరోధాన్యం, అనుగ్రహం అనే దివ్య క్రియలకు ప్రతిరూపాలు అని తెలుపుతున్నాయి పురాతన గ్రంథాలు. ఈశనం, తత్పురుషం, సద్యోజాతం, వామదేవం, అఘోరం. సహజంగా

మనం సందర్శించుకొనే శివాలయాలలో కైలాసవాసుడు తూర్పు ముఖంగా కొలువై ఉంటారు. తూర్పు దిశను చూసే ముఖాన్ని 'తత్పురుషం' అంటారు. మిగిలిన ముఖాల దర్శనం చాలా అరుదు. అలాంటి ఒక విశేష ఆలయం బలిఘట్టం గ్రామంలో కనిపిస్తుంది. శ్రీ బ్రహ్మలింగేశ్వర స్వామి 'సద్యోజాత' దర్శనం ప్రసాదిస్తారు. అంటే పడమర ముఖంగా ఉంటారు. సృజనాత్మకతను, ఏకాగ్రత, సమస్యలను ఎదుర్కొనే శక్తిని ప్రసాదిస్తుంది. అంతేకాదు, నూతన ప్రయత్నాలలో విజయం సాధించి జీవితంలో కొత్త ఆరంభాన్ని చేయడానికి మార్గాన్ని అందించే అద్భుత దర్శనం సద్యోజాతం. ఆలయానికి ఎదురుగా ఎత్తైన పర్వతం ఉంటుంది. కార్తిక పౌర్ణమికి శిఖరాన కార్తిక దీపాన్ని వెలిగిస్తారు.

## శ్రీ రాజరాజేశ్వరీ దేవి

ఇక్కడ రాజరాజేశ్వరీ దేవి కొలువు తీరడం వెనుక ఒక యదార్థ గాథ ఉన్నట్లుగా చెబుతారు. పంతొమ్మిదవ శతాబ్ద మధ్య కాలంలో కీ.శే. నూకురు రామదాసు పంతులు గారు ఈ ప్రాంతానికి తహసీల్దార్‌గా ఉండేవారు. వారు గొప్ప శివ భక్తులు. మహాశివ రాత్రి నాటి రాత్రి లింగోద్భవ సమయంలో శ్రీ బ్రహ్మ లింగేశ్వర స్వామిని సేవించుకొని ఆనందంగా ఇంటికి వెళ్లారట. యవ్వనంలోకి అడుగుపెడుతున్న వారి కుమార్తె అప్పుడే హఠాత్తుగా మరణించిందట. కుటుంబ సభ్యుల దుఃఖానికి అంతు లేకుండా పోయింది. మగత నిద్ర పోతున్న పంతులుగారికి స్వప్న దర్శనమిచ్చిన పరమేశ్వరుడు "చింతించకు, నీ కుమార్తె పార్వతీ దేవి అంశతో జన్మించినది. నా అర్ధాంగిగా నాలో ఐక్యం అయ్యింది. కనుక ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్టించమని" ఆదేశించారట. ఆ ప్రకారం ఆ తండ్రి అమ్మవారి సన్నిధిని ఏర్పాటు చేశారు.

**ఆలయ విశేషాలు:** శ్రీ బ్రహ్మ లింగేశ్వర, శ్రీ రాజరాజేశ్వరీదేవి సన్నిధులు తప్ప మరో ఉపాలయం కనిపించదు ప్రాంగణంలో. చిన్న గుట్ట పైన ఉన్న ఆలయానికి దక్షిణం వైపున ఒడిస్సా /నగారా శైలిలో నిర్మించిన ప్రవేశ ద్వారం ఉంటుంది. చిన్న ప్రాంగణం మధ్యలో పడమర ముఖంగా ప్రధాన ఆలయం నిర్మించబడినది.

ఆలయం చుట్టూ ప్రదక్షిణా పథంలో మండపాన్ని నిర్మించారు. విశేషంగా చెప్పుకోవలసినది ఈ మండప స్తంభాల గురించి. మొత్తం నూట ఎనిమిది స్తంభాల ఉంటాయి. ఏ రెండు స్తంభాలు ఒకే రకంగా ఉండకపోవడం నాటి శిల్పుల గొప్పదనానికి నిదర్శనం. పడమర వైపున కూడా ఒక ద్వారం ఉంటుంది. దక్షిణం పక్క నుండి ప్రాంగణంలోకి ప్రవేశించగానే ఎడమ పక్కన ప్రథమ పూజ్యుడు శ్రీ గణపతి దర్శనమిస్తారు.

ప్రదక్షిణా క్రమంలో క్షేత్ర పాలకుడైన శ్రీ మహావిష్ణువును దర్శించుకోవచ్చు. గర్భాలయంలోకి వెళ్లే గుమ్మం పక్కన కొన్ని పురాతన శాసనాలు కనిపిస్తాయి. వాటి ఆధారంగా ఈ ఆలయాన్ని పదో శతాబ్దంలో చాళుక్య రాజులు నిర్మించినట్లుగా అర్థం అవుతుంది.

గర్భాలయంలో స్ఫటిక లింగ రూపంలో దేదీప్యమైన దర్శనం అనుగ్రహిస్తారు. పక్కనే ఉన్న మరో సన్నిధిలో శ్రీ రాజరాజేశ్వరి దేవి ప్రసన్నవదనంతో కొలువై ఉంటారు. గర్భాలయం ముందు ఉన్న చిన్న ముఖ మండపంలో శ్రీ నందీశ్వరుడు నందివాహనుని ఆజ్ఞ కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉపస్థిత భంగిమలో కనిపిస్తారు. శరీరానికి, మనస్సుకు అవసరమైన శాంతిని ప్రసాదించే క్షేత్రం శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ బ్రహ్మలింగేశ్వర స్వామి కొలువు తీరిన బలిఘట్టం.




## ఆలయ ఉత్సవాలు

నిత్యం పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. పర్వదినాలలో చుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా భక్తులు వస్తుంటారు. ఈ ఆలయం కార్తికమాస పూజలకు ఎంతో ప్రఖ్యాతి గాంచింది. కార్తిక పౌర్ణమి నాడు ఆలయానికి ఎదురుగా ఉన్న పర్వత శిఖరంపైన కార్తిక దీపాన్ని వెలిగిస్తారు. కార్తిక పౌర్ణమినాడు జరిగే జ్వాలా తోరణం, తిరువీధి ఉత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. కార్తిక శుద్ధ ఏకాదశి నాడు ఆదిదంపతుల కల్యాణాన్ని రంగరంగ వైభవంగా జరుపుతారు.

మహాశివరాత్రి, గణపతి నవరాత్రులు, దసరా నవరాత్రులు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. కొండ పక్కనే పంచాయతన విధానంలో నిర్మించబడిన శ్రీ మహాలక్ష్మి ఆలయం, ప్రధాన రహదారి వద్ద శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం దర్శనీయాలు.

ఎందరో మహర్షులకు నిలయంగా చెప్పుకొనే వరాహ నదీ తీరంలో నేటికీ కొన్ని అవధూతల ఆశ్రమాలు కనిపిస్తాయి. ఎన్నో విశేషాలకు నిలయమైన వెయ్యి సంవత్సరాల పురాతన శ్రీ బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుండి మూడు కి.మీ. దూరంలో ఉంటుంది. ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో వెళ్ళాలి. నర్సీపట్నానికి అనకాపల్లి, విశాఖపట్నం నుండి బస్సులు లభిస్తాయి. భోజనం, వసతి అందుబాటు ధరలలో ఉంటాయి.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు

కథ

# మహోన్నత ఆశయం

**పేలూరి వెంకట మీనాక్షి**

**"ఏమండీ మీకు కొరియర్‌లో ఎవరో ఓ పార్సిల్ పంపించారండీ" అంది వనజ... అప్పుడే ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన భర్త గౌతమ్‌తో.**

**"పార్సిల్ పైన పేరు ఉంటుంది. చూడక పోయావా..." అన్నాడు.**

"దాని పైన 'గెస్ మీ' అని మాత్రమే ఉందండి" అంది.

"అవునా?" అంటూ పార్సిల్ ఓపెన్ చేసి చూసాడు. అందులో ఓ పాత మోడల్ గొడుగు, దానితో పాటు ఓ లేటెస్ట్ మోడల్ సెల్ ఫోన్ కూడా ఉంది. ఆ గొడుగుని చూడగానే హృదయపు లోతుల్లో నుండి ఓ ప్రాణ స్నేహితుని పేరు పెదాలు పైకి వచ్చింది 'శ్రీరామ్.....'

"శ్రీరామ్, ఎలా ఉన్నావురా. ఎక్కడున్నావ్‌రా.. నీ కోసం ఎంతని వెతకాలి. రోజులు... నెలలు... సంవత్సరాలు.. గడిచిపోతున్నాయి. నీ వైపు నుంచి ఏ కబురు లేదు. కానీ నా మనసు చెబుతోంది నువ్వు ఏదో ఒకరోజు నన్ను వెతుక్కుంటూ వస్తావని.

నన్ను విడిచిపెట్టి వెళ్ళాక నేను ఒక్కసారి కూడా నీకు గుర్తు రాలేదా? ఎంత కాలం అయిందిరా నిన్ను చూసి! నిన్ను చూడాలని ఉందిరా.. నీతో కబుర్లు చెప్పాలని ఉందిరా.." అంటూ ఆ గొడుగుని ఆప్యాయంగా గుండెలకి హత్తుకున్నాడు.

కళ్ళ వెంబడి నీళ్లు అచేతనంగా జలజలా రాలి తన గుండెల మీద పడి చిన్ననాటి స్మృతులను తట్టి లేపుతున్నాయి. మనసు వేగంగా పాతిక సంవత్సరాలు వెనక్కి పరిగెట్టి అప్పటి జ్ఞాపకాలను కళ్ళముందుకు తెచ్చింది.

శ్రీరామ్, గౌతమ్ ఇద్దరు చిన్నప్పట్నుంచి ఒకే స్కూల్లో ఐదో తరగతి వరకు చదువుకున్నారు. శ్రీరామ్ తండ్రి జమ్మూ కాశ్మీర్‌లో ఆర్మీ ఆఫీసర్‌గా పనిచేసేవారు. దాంతో చిన్నవాడైన శ్రీరామ్‌ని అంత దూరం తీసుకెళ్లడం ఇష్టం లేక తన తల్లితో పాటే వాళ్ల సొంతూరులోనే ఉంచారు. అప్పుడప్పుడు సెలవులకి వాళ్ళ డాడీ వచ్చినప్పుడల్లా బంధువుల ఇంటికి వెళ్లి స్కూల్ తెరిచే సమయానికి వచ్చేసేవాడు.

ఐదో తరగతి ఎగ్జామ్స్ అయ్యాక ఒకరోజు ఇంటికి వచ్చి వాళ్ళ నాన్నగారికి ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అయ్యిందని తనని అక్కడ ఆరో తరగతిలో జాయిన్ చేస్తున్నారని ఆ రోజు సాయంత్రమే బయలు దేరుతున్నట్టు చెప్పాడు.

ఆ రోజు సాయంత్రం అకస్మాత్తుగా హోరున వర్షం మొదలైంది. ఎందుకో వాడ్ని వదల్లేక మనసు విలవిల్లాడింది. కనీసం స్టేషన్ దాకా వెళ్లి ట్రైన్ ఎక్కేవరకైనా వాడితోనే ఉండాలనిపించి నాన్నని అడగ్గానే "సరే.." నన్నారు.

అంత వర్షంలోనూ ఇద్దరం చెరో గొడుగు వేసుకుని మరీ వెళ్ళాం.

వాడు కూడా నన్ను వదల్లేక గట్టిగా కౌగిలించుకుని వలవలా ఏడ్చాడు. "బాయ్‌రా.. వచ్చే వేసవి సెలవుల్లో కలుద్దాం" అంటూ బాధగా ట్రైన్ ఎక్కుతున్న వాడికి ఏదైనా ఇవ్వాలనిపించి నా చేతిలో ఉన్న గొడుగుని వాడి చేతికిచ్చి నా గుర్తుగా ఉంచుకోమని చెప్పాను.



అది నా మేనత్త గల్ఫ్ నుంచి నాకు పంపిన గిఫ్ట్. వర్షం వచ్చినప్పుడల్లా మేమిద్దరం ఆ గొడుగులోనే కలిసి వెళ్ళేవాళ్ళం. వాడు అప్పుడప్పుడు కాస్త చిలిపి పనులు కూడా చేసేవాడు.

ఆ గొడుగులో వర్షం నీళ్ల నింపి స్నేహితులందరిపై వేస్తూ "వర్షం వస్తుంది పరిగెత్తండి" అంటూ వాడూ పరిగెత్తేవాడు. అలా వాడు దానితో ఆటలాడేవాడు. అందుకే దాన్ని వాడికి ఇవ్వాలనిపించి ఇచ్చేసాను.

కొన్నాళ్ల తర్వాత కార్గిల్ యుద్ధంలో వాళ్ళ నాన్నగారు చనిపోయారని, తను వాళ్ళ అమ్మతో కలిసి అమెరికా వెళ్లిపోయాడని తెలిసింది.

అప్పట్నుంచి వాడ్ని మరలా కలిసే అవకాశం రాలేదు. ఇదిగో ఇప్పుడు ఈ పార్సిల్ వచ్చింది. బహుశా వాడు ఇండియా వచ్చుండాలి.. అనుకోగానే ఆ తలంపే ఎంతో సంతోషాన్నిచ్చింది. ఇంతలో వాడు పంపిన కొత్త సెల్ ఫోన్‌కి కాల్ వచ్చింది.

లిఫ్ట్ చేయగానే "అరే గుర్తుపట్టావా?" అంటూ పక పకా నవ్వుతున్నాడు.

నాకు మాటలు పెగలట్లేదు. ఆనందం, దుఃఖం రెండు ఒకేసారి పెల్లుబికి వరదలాగా పైకి తన్నినట్టు గొంతు పూడుకుపోయింది.

కాసేపటికి తమాయించుకుని "ఎలా ఉన్నావ్‌రా? ఎక్కడున్నావ్?" అని ప్రశ్న మీద ప్రశ్న సంధిస్తూనే ఉన్నాను.

వాడు "నీ ప్రశ్నలన్నిటికీ సమాధానం రేపు నేను వచ్చేక చెప్తానురా. నా ఫ్యామిలీతో కలిసి రేపు మీ ఇంటికి వస్తున్నాను. ఇద్దరం కలిసి మీ ఇంట్లోనే తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ చేద్దాం" అన్నాడు.

"సరే...." నంటూ సంభాషణ ముగించి వనజ వైపు చూశాను.

తను చిరునవ్వుతో "రేపటికి కావల్సిన ఏర్పాట్లు అన్నీ నేను చూసుకుంటాను.." అన్నట్టు కళ్ళతోనే సైగ చేసింది.
ఈరోజు త్వరగా గడిచిపోయి త్వరగా తెల్లారిపోతే బాగుండుననిపించింది మనసుకు.

క్షణం ఒక యుగం లాగ గడిచింది. వాడి ఆలోచనల్లో పడి ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

"ఏవండీ! వాళ్ళకి కావాల్సిన టిఫిన్లు అన్నీ సిద్ధం చేశాను. లేవండి స్టేషన్‌కెళ్లి వాళ్ళని రిసీవ్ చేసుకుని తీసకురండి" అన్న నా భార్యామణి పిలుపుతో మెలకువ వచ్చింది.

అప్పటికే టైం ఎనిమిది కావడంతో రివ్వున వెళ్లి సర్రున స్టేషన్‌లో వాలిపోయాను నా పదేళ్ల కూతురు లాస్యతో సహా.

వాడు రాగానే నన్ను గుర్తుపట్టడం, కారులో మేమంతా ఇంటికి కలిసి రావడం, మా ఇరువురి కుటుంబాల పరిచయ కార్యక్రమం, వాడు మా కోసం తెచ్చిన ఖరీదైన వస్తువుల్ని ఇవ్వడం, అమ్మా, నాన్నలకి శ్రీరామ్ దంపతులిద్దరూ కాళ్ళకు నమస్కరించి

పూసగుచ్చినట్టు చెప్తూ... రెండు సంవత్సరాల క్రితం వాళ్ళ అమ్మ హార్ట్ స్ట్రోక్‌తో చనిపోయిందని కూడా బాధపడుతూ చెప్పాడు.

నాన్న పోయాక అమ్మ ఎప్పుడూ " నువ్వు బాగా చదువుకుని పెద్ద డాక్టర్ అవ్వాలిరా, మీ నాన్నగారి ఆశయం నెరవేర్చాలని" చెప్తూ ఉండేదని తన తల్లిని, ఆమె మాటలను గుర్తు చేసుకుని చిన్నపిల్లాడిలా ఏడ్చాడు.

నెల రోజుల తరువాత ఓ రోజు ఇల్లు సర్దుతున్నప్పుడు వాళ్ళ నాన్న రాసిన లెటర్లు వాళ్ళమ్మ షెల్ఫ్‌లో దొరికాయని వాటిని చూశాక తన తండ్రి ఆశయం పూర్తిగా అర్థమైందని చెప్పాడు.

ఆయన ఆశయం నెరవేర్చాలని తన కుటుంబంతో సహా ఇండియాకి వచ్చినట్టు చెప్పాడు. వాడు మాటలు

**కాసేపటికి తమాయించుకుని "ఎలా ఉన్నావ్‌రా? ఎక్కడున్నావ్?" అని ప్రశ్న మీద ప్రశ్న సంధిస్తూనే ఉన్నాను.**

**వాడు "నీ ప్రశ్నలన్నిటికీ సమాధానం రేపు నేను వచ్చేక చెప్తానురా. రేపు నా ఫ్యామిలీతో కలిసి మీ ఇంటికి వస్తున్నాను. ఇద్దరం కలిసి మీ ఇంట్లోనే తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ చేద్దాం" అన్నాడు.**

వాళ్ళు తెచ్చిన కొత్త బట్టలు ఇచ్చి ఆశీర్వచనం తీసుకోవడం... ఇలా అన్నీ చక చకా జరిగిపోయాయి.

మేమందరం చిన్ననాటి ముచ్చట్లు గుర్తు చేసుకుంటూ టిఫిన్ చేశాం.

మాటల మధ్యలో నేను డిగ్రీ చదివి ఉద్యోగం కోసం ప్రయత్నించి.. ప్రయత్నించి చేసేదిలేక బతుకు తెరువుకోసం ఊర్లోనే ఓ చిన్న జిరాక్స్ షాప్ పెట్టుకున్నట్టు తర్వాత వనజ నా జీవితంలోకి రావడం, పాప పుట్టడం అన్నీ వివరంగా చెప్పాను.

వాడు తన తండ్రి చనిపోయాక వాళ్ళమ్మ తనను అమెరికా తీసుకెళ్లి చదివించిందని. ఇప్పుడు తన అక్కడ ఓ వెల్ సెటిల్డ్ డాక్టర్ అని, డబ్బు, పలుకుబడి ఎంతో సంపాదించి స్థిరపడినట్టు చెప్పాడు.

తన భార్య సుమతో పరిచయం, పెళ్లి, బాబు పుట్టడం అన్ని

విన్న తర్వాత మా అందరి కళ్ళు చెమర్చాయి. మా నాన్న అయితే మా ఊరిలో ఆయనకున్న ఎకరం పొలం తాలూకు దస్తావేజులు శ్రీరామ్ చేతిలో పెట్టి "బాబూ, ఎంత గొప్ప తల్లితండ్రుల కడుపున పుట్టావయ్యా... దేశం కోసం ఆయన ప్రాణాలు అర్పించడమే కాదు ఎంత గొప్ప ఆశయంతో నిన్ను పెంచమని చెప్పారో వింటుంటేనే మా హృదయం పులకించిపోయింది. ఆయన ఆశయం నెరవేరాలి. నీ తల్లి పడిన కష్టం వృథా కాకూడదు.

నువ్వు అనుకున్నట్టు మన ఊర్లోనే ఓ పెద్ద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టి ఉచితంగా పేదలకు వైద్యం చేయ్యాలి. నీ సత్సంకల్పానికి ఈ చిన్న కానుక ఇస్తున్నాను. కాదనొద్దు. హాస్పిటల్ కట్టడానికి ఈ పొలం అన్ని రకాల సౌకర్యంగా ఉంటుంది" అనగానే..

మా అమ్మ వెంటనే తన చేతికున్న బంగారు గాజులు శ్రీరామ్ చేతిలో పెట్టింది. వద్దని వాడు వారిస్తుంటే

"నేను ఇప్పటివరకు నా కన్నతల్లి వంటి ఈ మాతృభూమికి ఎటువంటి సేవ చేయలేదు. ఇప్పుడు మీ ద్వారా నాకు ఆ సేవా భాగ్యం దక్కింది కాదనొద్దు" అంటూ ఆనందంతో ఆమె కళ్ళ వెంబడి వస్తున్న ఆనంద బాష్పాలను తన పైట చెంగుతో తుడుచుకుంది.

ఇంతలో నా కూతురు లాస్య పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్లి తను డిబ్బీలో దాచుకున్న చిల్లర డబ్బులు తీసుకొచ్చి "అంకుల్! ఇవి కూడా తీసుకోండి ప్లీజ్" అంటూ డిబ్బీని శ్రీరామ్ చేతిలో పెట్టింది.

మళ్లీ "అంకుల్, నేను పెద్దయ్యాక పెద్ద డాక్టర్ అయ్యి మీరు కట్టే హాస్పిటల్‌లో ఉచితంగా వైద్యం చేస్తాను" అంది.

ఇంతలో శ్రీరామ్ కొడుకు రిషి కల్పించుకుని "నేను కూడా డాక్టర్ అయ్యి పేద వాళ్ళందరికీ సాయం చేస్తాను డాడీ" అన్నాడు. అది చూసి అందరి కళ్ళు ఆనందంతో చెమర్చాయి. "ఆశయం ఎంతో గొప్పదైతేనేగానీ అందరి హృదయాలను గెల్చుకోలేదు. ఆ పసి హృదయాల్ని సైతం కదిలించిందా ఆశయం. జీవించినంత కాలం దేశం కోసం ఓ సైనికుడిగా సేవలందించడమే కాదు. తన తర్వాత కూడా ప్రజలకు సేవ చెయ్యాలనే ఆ మహానుభావుడి సత్సంకల్పం అద్భుతం. ఆయన మహోన్నతమైన ఆశయం తప్పక నెరవేరుతుంది" అంటూ గౌతమ్ తల్లిదండ్రులిద్దరూ ఆశీర్వదించారు. స్నేహితులిద్దరూ ఆ ప్రాజెక్టు కోసం ఏమేం చేయాలో ఆలోచించుకుని ఆ రోజే తమ చిన్ననాటి మిత్రులందరి సమావేశపరిచి గ్రామ పెద్దలతో మాట్లాడి కార్యాచరణకి వారి దగ్గరున్న 10 కోట్లకి సరిపడా లెక్కలు వేసుకొని కావాల్సిన అమౌంట్ ఎలాగ మీట్ అవ్వాలి, బ్యాంకులో లోన్ ఎలా తీసుకోవాలి? అన్ని విషయాలు మాట్లాడుకుని పట్టుదలతో ముందడుగు వేశారు.

ఈ విషయం ఊరంతా పొక్కింది. "మేము సైతం" అంటూ గౌతమ్ స్నేహితులు కూడా వీళ్ళతో కలిసి చేయూత నందించడానికి ముందుకొచ్చారు. అందరి ఆశీస్సులు మధ్య హాస్పిటల్ శర వేగంగా మొదలై కార్యరూపం దాల్చింది.

"గొప్పవాళ్ళంటూ ఎవరూ ఆకాశం నుంచి ఊడిపడరు. సామాన్య మనుషుల నుంచే వాళ్ళూ పుడతారు. కానీ వాళ్ళ ఉన్నతమైన ఆలోచనలు, సత్సంకల్ప బలంతో ఒకానొక ఉజ్వలమైన ఆశయంగా పరిణమించి అందరి హృదయాలను గెలుచుకొని కార్యరూపం దాలుస్తాయి. ఆ గొప్ప వ్యక్తులు మరణించినా కూడా ప్రజల హృదయాల్లో, చరిత్ర పుటల్లో అమరులుగానే ఉంటారు" అంటూ కాలం తోక తెగిన గాలిపటంలా రయ్ మంటూ ముందుకు దూసుకుపోయింది.

# బోణి

కాంతం పండ్ల వ్యాపారి. ఒకానొక రోజు కాంతం పల్లె నుండీ పట్నానికి బుట్ట నిండా మామిడి పండ్లని అమ్మడానికి తీసుకొచ్చింది. బుట్టని కిందకు దించి బుట్ట ముందు కూచోనున్నది. ఇంతలో బక్క పలుచగా వున్న ఓ షావుకారు కారులోంచి దిగి కాంతాన్ని సమీపించి "కేజి మామిడి పండ్లు ఎంతకిస్తున్నావమ్మా?" అడిగాడు.


"నూట యాభై రూపాయలు" "ఓ కేజి మామిడి పండ్లివ్వమని, ఐదు వందల నోటు తీసివ్వబోతే... కాంతం ఆ నోటు వంక చూసి "చిల్లర లేదు"

"అంత వ్యాపారం చేస్తున్నావు. ఐదు వందలకు చిల్లర లేదా?" "మీదే బోణి సారూ!" "ఆ పండ్ల కవరిటివ్వు. కారులో ఇంటికెళ్ళి ఓ పది నిమిషాల్లో నీ కివ్వాల్సిన డబ్బులు తెచ్చిస్తాను" "మా నాయనే! ఆ పండ్ల కవర్ అక్కడబెట్టి చిల్లర తీసుకురాపో!

"ఏం? నా మీద ఆ మాత్రం నమ్మకం లేదా!" "ఈ కలికాలంలో నిన్నే కాదు ఎవర్నీ నమ్మలేం బాబూ! చిల్లర తీసుకొచ్చి, ఇచ్చి పండ్ల కవర్ తీసుకొని పో" అన్నది నిర్మొహమాటంగా. "సరే అలాగే" అని ఇంటికెళ్ళి నూట యాభై రూపాయలు తీసుకొచ్చి ఇచ్చి ఆ మామిడి పండ్ల కవర్ని తన చేతికి తీసుకుని "కాంతం! మరి నా బోణి మంచిదో కాదో తెలుసుకోవాలంటే ఎలా?" "సాయంకాలం ఆరు గంటలకి రండి. మీ బోణి మంచిదో కాదో చెబుతాను" "అలాగే వస్తాను" అని ఇంటిముఖం పట్టాడు.

... ... ..

సరిగ్గా ఆరు గంటలకు షావుకారు కాంతం దగ్గర కొచ్చి "అమ్మా! నా బోణి మంచిదేనా!"



"అయ్యా! మీ బోణి చాలా మంచిది. మీ బోణీ వల్ల ఈ రోజు పండ్లన్నీ అమ్మగా వచ్చిన ఆదాయం ఐదు వేల రూపాయలు!" "అన్నట్లు ఈ రోజు నాకిచ్చిన పండ్లు తియ్యగా బలే బాగున్నాయి. ఇంటిల్లిపాదీ తిని సంతృప్తి చెందాం"

షావుకారు మాటలు విన్న కాంతం ఆ షావుకారుతో "మా తోటలోని మామిడికాయలు రసాయనిక ఎరువులతో పండించినవి కావు సార్. రసాయనాలలో ముంచి రంగు మార్చిన పండ్లు అంతకంటే కావు. వాటిని సేంద్రీయ ఎరువులతో పండించాం. చెట్టు మీదే పండిన పండ్లు బాబూ అవి. అందుకే అవి అంత తియ్యగా వున్నాయి" అని చెప్పి ఖాళీ బుట్టని చంకలో పెట్టుకొని తన పల్లె దిశగా తృప్తిగా నడక సాగించింది కాంతం.

– సిహెచ్.నాగార్జున శర్మ

## బాపూ స్మృతి కవితలు

**పుస్తక సమీక్ష**

"ప్రజాకవి కాళోజీ అన్యాయాన్నెదిరించినోడు నాకు ఆరాధ్యుడు అన్న గాంధేయవాది. కాళోజీలా గాంధీ మీద తెలుగులో ఇన్ని కవితలు రాసినవారు ఎవరూ లేకపోవచ్చు. కాళోజీ ఫౌండేషన్ పునర్ముద్రించిన 'నా గొడవ బాపూ' కవితా సంపుటిలో 17 కవితలున్నాయి. చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకుంటున్న గాంధేయుల ప్రవర్తన, కాళోజీకి వేదన కలిగిస్తుంది. కాళోజీ ధిక్కారవాదం, రాజీ లేని నిర్మోహమాటం, నిష్కళంక వ్యక్తిత్వం బాపూయే కాదు, ఎంత మహాత్ముడయినా ఆయన గొడవగానే ప్రతిబింబిస్తుంది. "ఏదో ఆ తెల్లోడి రాజ్యం కాబట్టి బతకనిచ్చిండు నిన్ను- నీ క్రమాన" అంటూ 1947 నుండి దిగజారిన జాతీయ దుస్థితికి బాపూని విస్మరించటమే కారణమని" స్వరాజ్యం రాగానే కట్టించామా నీ ఆట? రాజఘాట్‌లో 'స్మారకం' నీ ఈ ప్రయోగాల సమాధికాక మరేమిటి?" అంటారు. తనదైన శైలిలో "మరతుపాకి యానమొకటి ఏర్పడు సూచనలున్నవి!! అంటూ "పిరికిపంద బ్రతుకుకన్న హింస వెయ్యిరెట్లు మిన్న" అంటారు. 1975 ఎమర్జన్సీ నాటి హింసాకాండను గుర్తు చేసుకొనే సందర్భంలో రాసిన కవితలో "అందుకే అన్నాను- అంటూ వున్నాను" "నైజామునాడు అన్నాను- నెహ్రూ నాడూ అన్నాను, ఇప్పుడూ అంటున్నాను. దగాకోరు దుండగీడు దర్జాగా బ్రతుకుతుంటే సక్రమ మార్గాయాసం సహించెడి వాడెవ్వడు" గాంధీజీ హత్యానంతరం, స్వతంత్ర భారతంలో వివిధ సందర్భాలలో కవితా పరంగా వ్యక్తీకరించిన కాళోజీ కవితలను నా గొడవ బాపూ! బాపూ!! బాపూ.. కాళోజీ ఫౌండేషన్ వరంగల్ నిర్వాహకులు నాగిళ్ల రామశాస్త్రి ఇతర సన్మిత్రులు ప్రచురించటం అభినందనీయం.

**(నా గొడవ (బాపూ స్మృతి కవితలు); రచన: కాళోజీ;**
**వెల: రూ.60/-లు; ప్రతులకు: నవోదయ బుక్ హౌస్,**
**కాచీగూడ ఎక్స్ రోడ్స్, హైదరాబాద్)**



## చదివింపజేసే కథలు

హాస్య కథల సంపుటాలు ప్రచురించి సాహిత్యంలో చిన్న కథలు రాయడంలో సిద్ధహస్తులుగా గుర్తింపు పొందిన ఆర్.సి.కృష్ణస్వామి రాజు 'గరం గరం చాయ్' (50 మినీ కథలు) వెలువరించారు. దైనందిన జీవనంలో మనస్తత్వాల సంఘటనలను కథానికలుగా హాస్యం, చమత్కారం, ఆహ్లాదం తాళింపు మేళవించి చదువరులచే సెభాష్ అనిపించుకున్నారు రచయిత. వాస్తవ జీవన ఇతివృత్తాలను చూసి, అనుభవించి కల్పనాయుత రచనా ప్రతిభతో కథలుగా అల్లటంతో, ప్రతీకథ చదివింపచేస్తుంది. వివిధ పత్రికలలో ప్రచురింపబడిన ఈ కథలు, అద్భుతమైన ఊహ నుంచి తళుక్కున మెరుపుగా విద్యుల్లత కాంతితో హృదయాన్ని తన్మయింపచేస్తాయి. కథల ముగింపు మన ఊహకు అందదు. 'చైనా చదువు' మాట అర్థం అంతే అనుభవం అంటే.. జుట్టంతా రాలిపోయాక దొరికే దువ్వెన లాంటిది అంటుంది. పెళ్ళాం పాకెట్ మనీ, తల్లికి దండం పెట్టే కథలో నేలతల్లికి వందనం, ఆల్చిప్పలు నోరు తెరవకపోతే ముత్యాలు ఎలా దొరుకుతాయి అనే స్వాతి ముత్యాలు, ఒకే టూత్ బ్రష్ జంట కథ, అన్ని కథలు ముగింపు రచయిత కల్పనా చమత్కృతి ప్రతిభావంతంగా స్పష్టం చేస్తున్నాయి. సామాజిక ప్రయోజనాన్ని ఆశించే మానవీయత, సామాజికత కుటుంబ దాంపత్య నేపథ్యంలో వున్న కథలలో విలువలు, స్థితిగతులు, వివిధ ధృక్కోణాలలో కళ్లముందు కదలింపజేస్తాయి. చదువరులను హాయిగా, సరదాగా రంజింపచేయగలరని ఈ సంపుటి స్పష్టం చేస్తోంది.

**(గరం గరం చాయ్, రచన: ఆర్.సి.కృష్ణస్వామి రాజు;**
**వెల: రూ.100/-; ప్రతులకు: ఆర్.సి. కృష్ణస్వామి రాజు,**
**నం.22-4-71 , బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, పోస్ట్:**
**అక్కిరంపల్లి, తిరుపతి-517507, ఆంధ్రప్రదేశ్)**

## జీవితానుభవాల సారం

రచయిత బి.వి.ఎన్. స్వామి తనకు అత్యంత ఆత్మీయ రూపమైన కథా రూపానికి, ఆత్మకథా విస్తృత కేన్వాస్‌లో ఒక నవలగా ఇప్పటివరకు గడిచిన జీవితానుభవాలను ప్రతిబింపచేసారు. ఈ ఆత్మకథాత్మక నవలకు పల్లేరు కాయలు అని పేరు పెట్టడంలో పలుబాధలు, ఎదురీతలు, అంతః సంఘర్షణలకు గురి అయిన వివరాలున్నాయి. ఐదు సంవత్సరాల నుండి 61 సంవత్సరాల వయసు వరకు బడితో ముడిపడిన జీవన కథనం యిది. రచయిత పాఠశాలలో నేర్చుకున్న విలువలు క్రమక్రమంగా కనుమరుగయ్యాయని, క్షీణించిన ఆ విలువలు బడి పట్ల విముఖత పెంచాయని అంటారు రచయిత. ఉద్యమాలలో పాల్గొనటం, ఉపాధ్యాయునిగా మానవ వనరుల వృద్ధికి కృషి, సాహిత్యం రచయితను నడిపించాయి. వృత్తి చరమాంకం ఈ నవలకు జన్మనిచ్చింది. జీవితానికి మలుపు యిచ్చింది అంటారు తన ముచ్చటలో. తెలంగాణ స్ఫూర్తితో కథలు రాసిన డా॥ బివిఎన్ స్వామి ఉద్యమ దశల్ని హోరెత్తించిన సందర్భాలను, సకల జనుల సమ్మె 42 రోజుల సమ్మె తేదీల వారీగా ఈ నవలలో ప్రచురింపచేయడం విశేషాంశం. నవల ముగింపులో మనసు ప్రశాంతత, సాహిత్యంలో చివరిదాకా కొనసాగాలని కోరుకోవడంతో డా॥ బివిఎన్ స్వామి నవల ముగుస్తుంది.

**(పల్లేరుకాయలు-రచన: డా.బివిఎన్ స్వామి;**
**వెల: రూ.120/-లు; ప్రతులకు: డా॥ బివిఎన్ స్వామి,**
**నం.9-6/161/1, రామ్‌నగర్, కరీంనగర్-500 501)**

**- జయసూర్య**

# అంగవైకల్యాన్ని జయించిన ఆర్చర్ శీతల్‌దేవి



మన జీవన ప్రయాణంలో అనునిత్యం ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమస్య వస్తూనే ఉంటుంది. కొందరు వాటిని చూచి బెంబేలెత్తి భయపడిపోతారు. మరికొందరు ధైర్యంగా ఎదుర్కొని అనూహ్య విజయాలు సాధించి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు. అటువంటి వారిలో శీతల్‌దేవి ఒకరు.

శీతల్‌దేవికి రెండు చేతులు లేకపోయినా కాళ్లతో విలువిద్యను ప్రదర్శించిన తొలి యువతిగా ప్రపంచ రికార్డు సృష్టించారు. గ్రామీణ నేపథ్యం నుంచి అంతర్జాతీయ వేదికపైకి ఎదిగి భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన దివ్యాంగురాలైన ఈ ఆర్చర్ కథ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం. శీతల్‌దేవి 2007 జనవరి 10న జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని కిష్ట్వార్ జిల్లాలోని లోయిధర్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. 'ఫోకోమెలియా' అనే పుట్టుకతో వచ్చే అరుదైన వ్యాధితో ఈమె జన్మించారు. ఆ కారణంగా ఆమె చేతులు పెరగలేదు. తల్లి శక్తిదేవి గొర్రెల కాపరి కాగా కాపరి కాగా తండ్రి మాన్‌సింంగ్ రైతు. శీతల్‌దేవి చెల్లెలి పేరు శివానిదేవి. చేతులు లేని శీతల్‌దేవి కాళ్ళతో నోట్స్ రాయడం, కళ్ళకు కాటుక పెట్టుకోవడం, అద్దం చూసుకోవడం, ఫోన్ ఉపయోగించడం, చెట్లు ఎక్కడం, కారు డ్రైవింగ్ మొ॥ పనులు చేయగలరు. పాఠశాలకు వెళ్ళడానికి శీతల్‌దేవి బాధపడేవారు. అందరి చూపులు చేతులులేని ఆమెను గుచ్చిగుచ్చి చూడటం మనస్థాపాన్ని కలిగించేది. 2019లో కిష్ట్వార్‌లో జరిగిన ఒక యువజన కార్యక్రమంలో భారత సైన్యం శీతల్‌దేవి విద్యకు మద్దతుగా నిలిచి వైద్య సహాయం అందించింది.

ఒకసారి బెంగళూరులో వైద్యం కోసం వెళితే తనలానే అంగవైకల్య సమస్యలతో బాధపడే వారిని శీతల్‌దేవి చూశారు. వారిలో ఆటలు ఆడేవారు, ఈత ఈదేవారు పరిచయమయ్యారు. అటువంటి వారిని చూచి ఆమెలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అక్కడ ప్రీతి అనే ఆమె పరిచయమై ఆర్చరీ క్రీడ గురించి చెప్పి, దాన్ని అభ్యసించడానికి మాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డ్ ఆర్చరీ అకాడమీ కోచ్ కుల్‌దేప్ వేద్వాన్ వద్దకు శిక్షణకు వెళ్ళమని సూచించారు. అమెరికాకు చెందిన మ్యాట్ స్టట్జ్మన్ వల్ల శీతల్‌దేవి ప్రేరణ పొందారు. చేతులు లేని మ్యాట్ స్టట్జ్మన్ 2012లో లండన్ పారాలింపిక్స్‌లో రజత పతకాన్ని సాధించారు. శీతల్‌దేవికి విలువిద్య (ఆర్చరీ)లో శిక్షణనిచ్చిన గురువులైన కుల్‌దీప్ వేద్వాన్, మహిళా కోచ్ అభిలాష ఇద్దరూ కలిసి అమెరికాకు చెందిన మ్యాట్ స్టట్జ్మన్ కాళ్ళతో ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న వీడియోలను చూపించారు. మ్యాట్‌తో పాటు అంగవైకల్యం పొంది పారా క్రీడల్లో పాల్గొని నిలిచిన అనేకమంది విజయాలను చూచి శీతల్‌దేవి స్ఫూర్తి పొందారు. ఆమెకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లు కుల్‌దీప్ వేద్వాన్, మహిళా కోచ్ అభిలాష ఆమెను ఎంతగానో ప్రోత్సహించి మనోధైర్యాన్ని నింపి శిక్షణ ప్రారంభించారు. జమ్మూ కశ్మీర్‌లోని కట్రా పట్టణ సమీపంలో ఉన్న మాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డ్ ఆర్చరీ అకాడమీ కోచ్ కుల్దీప్ వేద్వాన్ ఒక ఆర్మీ ఆఫీసర్ ద్వారా శీతల్‌దేవి గురించి తెలుసుకుని ఓసారి అకాడెమికి రమ్మని ఆహ్వానించారు. ఆ తరువాత శీతల్‌దేవి మాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డ్ ఆర్చరీ అకాడమీ చేరారు. శారీరక లోపాలున్న అనేకమంది అక్కడ విలువిద్యలో సాధన చేయడం శీతల్‌దేవి చూచి స్ఫూర్తి పొందారు. శీతల్‌దేవి ప్రధాన గురువైన కోచ్ కుర్‌దీప్ వేద్వాన్ ఆమె కోసం ప్రత్యేక విల్లును తయారు చేయించారు. నాటి నుండి రెండు కాళ్లతో విల్లును ఎక్కుపెట్టి, మెడ, భుజం సాయంతో బాణాన్ని సంధించడం శీతల్‌దేవి నేర్చుకుని పారాగేమ్స్ (దివ్యాంగుల క్రీడలు)లో పాల్గొనడం ప్రారంభించారు. అక్కడ నుండి వెనుతిరిగి చూడలేదు. తొలుత కాళ్ళతో విల్లును ఎక్కుపెట్టడానికి ఆమె చాలా శ్రమపడేవారు.

శిక్షణ పొందుతున్న తొలి రోజుల్లో 50 బాణాలు మాత్రమే సంధించేవారు. ఆ తరువాత రోజుకు 300 బాణాలు సంధించి శిక్షణలో అనేక మెళకువలు నేర్చుకున్నారు. శీతల్‌ను వెన్నంటి వుండే మహిళా కోచ్ అభిలాషతో పాటు మరో ఇద్దరు గురువులైన దివ్యరాణా శీతల్‌దేవికి మెళకువలు నేర్పగా, రోబిన్ కుమార్ సాధన సమయంలో కోచ్‌గా వ్యవహరించారు. పారా స్విమ్మర్ శరత్ గైక్వాడ్ కూడా ఆమెలో ధైర్యాన్ని నూరిపోశారు.

పారా క్రీడలు అనేవి శారీరక వైకల్యం ఉన్న వ్యక్తుల కోసం రూపొందించిన క్రీడలు. వీటిని పారా ఒలింపిక్ క్రీడలు అని కూడా అంటారు. ఇవి శారీరక, మానసిక అంగవైకల్యం కలిగిన వారికి ప్రోత్సాహానిచ్చి, నైపుణ్యాన్ని ప్రదర్శించే ప్రత్యేక క్రీడలు. ఈ క్రీడలను 1948లో బ్రిటన్‌లో రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొని అంగవైకల్యం పొందిన సైనికుల కోసం ప్రారంభించారు. ఇప్పుడు ఈ క్రీడలు అంతర్జాతీయంగా విస్తరించాయి.

ఇవి సాధారణ ఒలింపిక్స్ తర్వాత నిర్వహించే అంతర్జాతీయ క్రీడా పోటీలు. పారా ఒలింపిక్స్ అంటే 'ఒలింపిక్స్‌కు సమాంతరంగా జరిగే క్రీడలు' అని అర్థం. వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పారా–అథ్లెటిక్స్, పారా–స్విమ్మింగ్, బోచియా, గోల్‌బాల్, ఆర్చరీ ఇత్యాది అనేక విభాగాల్లో పారా క్రీడా పోటీలు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్నాయి. శీతల్ దేవి చేతులు లేని కారణంగా ఆమె కాంపౌండ్ బైను కాళ్లు, భుజంతో, నోరు ఉపయోగించి వాడతారు. కాంపౌండ్ బై అంటే ఆధునిక యంత్రిక రీతిలో, సాంకేతికంగా అభివృద్ధి చెందిన ధనస్సు. చేతులు లేకున్నా కాళ్లతో విలువిద్యలో ప్రావీణ్యాన్ని ప్రదర్శించిన తొలి భారతీయ మహిళగా శీతల్‌దేవి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

### శీతల్‌దేవి సాధించిన విజయాలు

శీతల్‌దేవి 2021 నుండి 15 సంవత్సరాల వయస్సులో ఆర్చరీలో శిక్షణ ప్రారంభించారు. 11 నెలల్లోనే 2022లో అనేక పతకాలు సాధించారు. హర్యానాలో 2022 మార్చిలో జరిగిన పోలా ఆర్చరీ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని తొలి జాతీయ స్థాయి విజయాన్ని సొంతం చేసుకున్నారు. అదే ఏడాది నవంబర్‌లో జూనియర్ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న అనుభవంతో ఆమె అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని తన సత్తా దాటి చాటారు.



చైనాలో 4వ ఆసియా పారా గేమ్స్ 2022లో జరగాల్సింది. అయితే కోవిడ్ కారణంగా వాయిదాపడిన ఆసియా పారా గేమ్స్ (దివ్యాంగుల క్రీడలు) 2023 అక్టోబరు 22 నుండి 28 వరకు చైనాలోని హాంగ్ జౌ నగరంలో జరిగాయి. ఈ క్రీడల్లో మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్‌లో ఒక స్వర్ణ పతకం, మహిళల వ్యక్తిగత కాంపౌండ్‌లో మరో స్వర్ణ పతకం, మహిళల డబుల్స్ కాంపౌండ్‌లో ఒక రజత పతకాన్ని సాధించి శీతల్‌దేవి 16 యేళ్ళ వయస్సులో మూడు పతకాలు సాధించి, రికార్డ్ సృష్టించి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నారు. 2023 మేలో జరిగిన యూరోపియన్ పారా ఆర్చరీ కప్‌లో శీతల్‌దేవి రజత పతకం సాధించారు. ఆమె మరో అంతర్జాతీయ పోటీలో పాల్గొని కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నారు. 2023లోనే చెక్ రిపబ్లిక్‌లో జరిగిన ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో రజత పతకాన్ని పొందారు. 2023లో జరిగిన ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో స్వర్ణపతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇదే ఏడాది బెస్ట్ యూత్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని సౌది అరేబియా రాజధాని రియాద్‌లో అందుకున్నారు. 2024లో ప్యారిస్ పారా ఒలింపిక్స్‌లో రాకేష్ కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన శీతల్‌దేవి పారాలింపిక్స్‌లో పతకం గెలిచిన అతి పిన్న (17 సంవత్సరాలు) భారతీయ క్రీడాకారిణిగా, పారాలింపిక్స్ మెడలిస్ట్ రికార్డు సృష్టించి కీర్తి గడించింది.

2025 సెప్టెంబర్ 17న దక్షిణ కొరియాలోని గ్వాంగ్జూ పట్టణంలో జరిగిన ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్స్ మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో స్వర్ణపతకం చేజిక్కించుకుని ఈ విభాగంలో బంగారు పతకం సాధించిన చేతులు లేని తొలి ఆర్చర్‌గా చరిత్ర సృష్టించారు. అంతేకాక ఫైనల్లో తుర్కియేకు చెందిన ప్రపంచ నంబర్ వన్ మహిళా ఆర్చర్ ఓజ్నూర్ క్యూర్ గిర్డిపై 146-143 తేడాతో 18 యేళ్ల వయస్సులో శీతల్‌దేవి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుని చారిత్రాత్మక విజయం సాధించడం మరో విశేషం. ఇదే టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్, కాంపౌండ్ మహిళల ఓపెన్ టీమ్ విభాగాల్లోనూ తన సహ క్రీడాకారులైన తోమన్ కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గ్రేట్ బ్రిటన్‌ను ఓడించి కాంస్య పతకాన్ని, కాంపౌండ్ మహిళల ఓపెన్ టీమ్ ఈవెంట్ సరితతో కలిసి రజత పతకం సాధించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు.

2023కు గాను భారత ప్రభుత్వం శీతల్‌దేవికి అర్జున్ అవార్డును ప్రకటించగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 2024 జనవరి 9న ఆ పురస్కారాన్ని అందుకున్నారు. 2024లో శీతల్‌దేవి పారాలింపిక్ మెడలిస్ట్ భారతదేశంలోనే అతి పిన్న మెడలిస్ట్‌గా గుర్తింపు పొందారు. ఇంకా బెస్ట్ యూత్ అథ్లెటిక్ ఆఫ్ ఏషియా పురస్కారంతో పాటు 2025లో బిబిసి ఎమర్జింగ్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ వంటి గౌరవాలను ఆమె పొందారు.

అమితాబచ్చన్ హోస్ట్‌గా భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన టెలివిజన్ క్విజ్ షో కౌన్ బనేగా కరోడ్పతిలో శీతల్ దేవి ప్రముఖ బాలీవుడ్ నటి విద్యాబాలన్ కలిసి అతిథిగా పాల్గొని ఆమె సహకారంతో పన్నెండున్నర లక్షలు గెలుపొందారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహేంద్ర ఈమెకు కారును బహూకరించారు.

తన ప్రయాణంలో శీతల్ దేవి ఎన్నో కష్టాలు పడి మూడేళ్ళ పాటు ఇంటికి దూరంగా ఉండి అనేక పతకాలు సాధించిన తరువాతే విజయగర్వంతో ఇంటికి వెళ్ళారు. ఎటువంటి అడ్డంకి వచ్చినా, నిజమైన సంకల్పంతో ఎదగవచ్చని చాటి చెప్పిన శీతల్‌దేవి కథ తమ కలలను సాకారం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ ప్రేరణ కలిగిస్తుంది. నిరంతర కృషి, పట్టుదల, అంకిత భావం కలిగివుంటే ఏదైనా సాధించగలరని శీతల్‌దేవి నిరూపించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు.

– షేక్ అబ్దుల్ హాకీం జాని

వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458




# ‘విదిక్కులు’ అంటే ఏమిటి?

**కె.పారితోష్, నాందేడ్**

**ప్రశ్న: ‘విదిక్కులు’ అంటే ఏమిటి? వాటిని ఎలా గుర్తించాలి? వీటి వల్ల లాభ-నష్టాలు ఏమిటి?**

**జవాబు:** స్థలం దిక్కులను సూర్యోదయ స్థానాన్ని బట్టి నిర్ణయించకూడదు. రుతువులను బట్టి సూర్యుడు ఉదయించే దిక్కుల్లో కొన్ని డిగ్రీల వరకు మార్పు వస్తుంది. కానీ అయస్కాంత క్షేత్రాన్ని బట్టి ఉత్తర దిక్కును సూచించే దిక్సూచిలో మాత్రం ఏ రుతువులోనైనా ఒకే దిక్కును స్థిరంగా చూడవచ్చు.

ఒక స్థలం దిక్కులు, దిక్సూచితో చూసి నిర్ధారింపబడుతూ ఉంటాయి. అలా ఒక స్థలానికి ఏర్పడిన దిక్కులు తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం. అయితే దిక్కులు కలిసిన మూలలు.. ఈశాన్యం, ఆగ్నేయం, నైరుతి, వాయువ్యం అవుతాయి. ఇది ఒక వాస్తు ప్రామాణికత. దిక్కులకు సంబంధించి పది డిగ్రీల వరకు తిరిగి ఉండటం వాస్తు నియమాలకు విరుద్ధం కాదు. ఒక స్థలానికి అంతకన్నా ఎక్కువ దిక్కులు తిరుగుతూ ఉండటం వలన వాస్తు విశిష్టత తగ్గుతూ ఉంటుంది. అలా దిక్కులు మూలలకి, మూలలు దిక్కులు వచ్చే విధంగా స్థలం తిరిగి వుంటే ఆ స్థలానికి ‘విదిక్కులు’ ఏర్పడ్డాయని అంటారు. ఇటువంటి స్థలాలు వాస్తు ప్రామాణికతకు దూరంగా ఉండటం వలన వాస్తు ప్రాధాన్యతను కోల్పోయిన స్థలాలుగా నిర్ధారింపబడ్డాయి. స్థలం మధ్య భాగంలో నిలబడి దిక్సూచితో చూసినప్పుడు, దిక్కులు మూలలకి సూచింపబడినట్లయితే ఆ స్థలం ‘విదిక్కులకు’ ఏర్పడిన స్థలంగా తెలుసుకోవచ్చు.

**వీటి వలన లాభనష్టాలు:** సృష్టిలో ఏది కూడా పూర్తి లాభాన్ని లేదా పూర్తి నష్టాన్ని మాత్రమే ఇవ్వవు. అలాగే ఇవి కూడా.



## గృహం తూర్పు దిక్కుకే కట్టాలా?

**ఇ.కార్తికేయ, కర్నూలు**

**ప్రశ్న: మేం గృహ నిర్మాణం కోసం ఒక స్థలం కొన్నాం. తూర్పున వీధి ఉంది. ఆ స్థలం తూర్పు దిక్కు(దిక్సూచి ప్రకారం) 10 డిగ్రీలు ఉత్తరానికి తిరిగి వున్నది. మా సందేహం ఏమిటంటే మేం కట్టబోయే గృహాన్ని కూడా అలాగే 10 డిగ్రీలు ఉత్తరానికి తిప్పి కట్టాలా? లేక పర్ఫెక్ట్‌గా తూర్పు దిక్కుకు తిప్పి కట్టాలా?**

**జవాబు:** అలా కట్టగూడదు. స్థలాన్నిబట్టే గృహ నిర్మాణం ఉండాలి. ఆలయ నిర్మాణాలకు, ప్రార్థనా మందిరాలకు సున్నా డిగ్రీలు ఉండాలి. నివాస గృహాలకు ఈ నిలయం వర్తించదు. దాదాపు 15 డిగ్రీలు తిరిగి వున్నా కట్టుకోవచ్చు. అయితే ముఖ్యమైన విషయం ఏమిటంటే- ఎటు వీధి ఉన్న స్థలమైతే ఈ 15 డిగ్రీలు ఎటు తిరిగి వుంటే మంచి ఫలితాలు వస్తాయనేది”.

మీ విషయంలో ఇలా 10 డిగ్రీలు ఉత్తరానికి తిరిగివున్నా సరే మీ ఆ స్థలంలో వాస్తు ప్రకారం గృహ నిర్మాణం చేసుకోవచ్చు.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం ‘వాస్తువార్త’లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:

**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................

పుట్టిన తేదీ : ............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................

చిరునామా:............................................

- మంచి మాటయే గొప్ప ఆలంకారం. ఆభరణాలన్నీ నశిస్తాయి. కానీ వాక్కు అనే ఆభరణం ఎన్నటికీ నశించదు.

  - భర్తృహరి

- చక్కగా మాట్లాడదలచుకున్నవారు ముందు చక్కగా వినడం నేర్చుకోవాలి.

  - ఆర్.ఫోకాల్డ్

# సన్మార్గం అంటే?

మనిషి ఎప్పుడూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటాడు. కాని ఈ ఆకాంక్షను సాధించడంలో చాలామంది నేటి కాలంలో మార్గం తప్పుతున్నారు. ఈ ఆధునిక యుగంలో కొంతమంది తాత్కాలిక సుఖం కోసం ఇతరులను నొప్పిస్తూ, అహంకారంతో, డబ్బును పరమలక్ష్యంగా తీసుకుని జీవిస్తున్నారు. అయితే ఈ జీవితం తాత్కాలికమైన ఆనందాన్నే ఇస్తుంది. ఆ తరువాత అది మనసులోని ఒత్తిడులు, భయాలు, అసంతృప్తులను మిగులుస్తుంది. సుఖశాంతులతో జీవించాలంటే ఏ మంత్రాలు అవసరం లేదు, ఏ దేవాలయ దర్శనం తప్పనిసరి కాదు. మన ఆలోచనలు, మన ప్రవర్తనే మన జీవితానికి దిశ చూపుతాయి. శాస్త్రీయంగా చెప్పాలంటే, మానవ మస్తిష్కం సానుకూల ఆలోచనలు, సహకారం, ప్రేమ, కరుణ వంటి భావాలతో నిండినప్పుడు 'సెరోటోనిన్', 'ఆక్సిటోసిన్' వంటి రసాయనాలు విడుదల అవుతాయి. ఇవే మనకు మానసిక శాంతి, సంతోషం కలిగిస్తాయి. వాస్తవ దృష్టిలో సన్మార్గం అంటే నిష్కపటత, న్యాయం, సమానత్వం, సహానుభూతి అనే మానవ విలువలను ఆచరణలో చూపడం. సన్మార్గం అంటే మనం చేసిన పనితో ఎవరికీ నష్టం జరగకూడదు, సమాజానికి కొంత మేలు జరగాలి.



## ఎందుకు?

మనం సన్మార్గంలో ఉండడం వల్ల మనకు మానసిక స్థిరత్వం వస్తుంది. వాస్తవానికి మానవ మస్తిష్కం నీతిమంతమైన చర్యల వల్లే తృప్తిని అనుభవిస్తుంది. పరిశోధనల ప్రకారం ఇతరులకు సహాయం చేసినప్పుడు మానవ మెదడులో 'రివార్డ్ సెంటర్' సక్రియమవుతుంది. అంటే మనసుకు సంతోషం కలిగించే హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. అందుకే మనిషి "మంచి పనులు చేస్తే మనసుకు తేలికగా ఉంటుంది" అని అనుభవిస్తాడు. కమలం బురదలో పూసినా తన తేజస్సు కోల్పోదు. అదే విధంగా మనం చెడు పరిస్థితుల్లో ఉన్నా మన విలువలను కోల్పోకపోవడం సన్మార్గం. ఇది ఆత్మ నియంత్రణ అనే మానసిక శక్తి. దీనివల్ల వ్యక్తి ఆలోచనలు స్థిరంగా, నిర్ణయాలు సమతుల్యంగా ఉంటాయి.

## ఆత్మవికాసానికి మూలం

సన్మార్గం అనుసరించే వ్యక్తి తనలోనే ఆత్మ పరిశీలన చేస్తూ ముందుకు సాగుతాడు. తన తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే ధైర్యం కలిగి ఉంటాడు. ఇదే శాస్త్రీయంగా 'స్వీయ అవగాహన' అని అంటారు. ఇది ఉన్నవారికి జీవితంలో స్థిరత్వం, మానసిక శాంతి ఎక్కువగా ఉంటాయి.. అని మానసిక వైద్య శాస్త్రం చెబుతుంది.

కేవలం డబ్బు లేదా పదవితో సుఖం రాదు. సంతృప్తితోనే సుఖం వస్తుంది. సన్మార్గంలో నడిచేవారికి ఆత్మగౌరవం ఉంటుంది. ఇతరులకు హాని చేయకుండా జీవించే మనిషి సమాజంలో విశ్వాసాన్ని సంపాదిస్తాడు. శాస్త్రీయంగా సన్మార్గం అనుసరించడం వల్ల శరీరంలో ఒత్తిడి కలిగినప్పుడు విడుదలయ్యే రసాయన వాహకాలు, ఇవి హృదయ స్పందన రేటును పెంచడం, శక్తి వనరులను సేకరించడం వంటి పనులను చేస్తాయి. వీటిలో ముఖ్యమైనవి కార్టిసాల్, అడ్రినలిన్, నోరాడ్రినలిన్ తగ్గి రక్తపోటు, ఆందోళన తగ్గుతాయి.

స్వార్థపూరిత జీవన విధానం దుర్మార్గం. మనం చేసే ప్రతి పనికీ "నేనేం పొందుతాను?" అనే దృష్టితో చూసేది దుర్మార్గం. అది మనలో అసూయ, భయం, అసహనం పెంచుతుంది. ఇవన్నీ మన మెదడు, గుండె, రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. దుర్మార్గం మనిషిని బయటకు బలంగా కనిపించేలా చేస్తుంది కానీ లోపలికి శూన్యంగా మార్చేస్తుంది. సన్మార్గంలో నడవడం ఒక శాస్త్రీయ సాధన. ఇది మానవ విలువల శాస్త్రం. ప్రతి మనిషీ రోజూ ఆత్మపరిశీలన చేయాలి, నేను నిన్న ఎవరికైనా నష్టం చేశానా? నా మాటల వల్ల ఎవరికైనా బాధ కలిగిందా? నేడు ఎవరికైనా సహాయం చేయగలనా? ఈ మూడు ప్రశ్నలకు సానుకూల సమాధానాలు దొరికితే మీరు సన్మార్గంలో ఉన్నట్టే. మనిషి జీవితంలో సుఖశాంతులు మన ఆలోచనలు, మన ప్రవర్తన ఫలితాలు. సన్మార్గం అనేది ధార్మిక మార్గం కాదు, అది వాస్తవిక జీవన శాస్త్రం. మనం నిజాయితీగా, న్యాయంగా, సహానుభూతితో జీవించినప్పుడు మనం మాత్రమే కాదు, మన చుట్టూ ఉన్నవాళ్లు సుఖంగా ఉంటారు. సన్మార్గం అనేది మానవ జీవితానికి శాస్త్రీయ మార్గం. దానిలో నడిచిన మనిషి నిజమైన మనీషి అవుతాడు. మానవ విలువలు, శాస్త్రీయ ఆధారాలు, మానసిక సమతుల్యత అనే మూడు స్థంభాల మీద నిలుస్తుంది.

– డాక్టర్ నూతలపాటి నాగేశ్వరరావు

విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడంలో ఇస్రో అధికారికంగా ప్రపంచంలోనే ప్రప్రథమ అంతరిక్ష సంస్థగా అవతరించింది. 4 అక్టోబరు 1957న స్పుత్నిక్1 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన రష్యా ప్రపంచం లోనే మొట్టమొదటి దేశంగా, 31 జనవరి 1958న తనఎక్స్ ప్లోరర్1 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన అమెరికా రెండవ దేశంగా చరిత్ర సృష్టించాయి.


రికార్డును గణనీయంగా అధిగమించింది. ఈ ప్రయోగం అసమానమైన పేలోడ్ విస్తరణ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఇస్రో నమ్మినబంటు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) ఇస్రో వాణిజ్య విజయానికి వెన్నెముక అని చెప్పవచ్చు. పిఎస్ఎల్వి తన గరిష్ట పని సామర్థ్యానికి పేరుగాంచింది. మే 2025 నాటికి, తన ప్రయోగాలలో

# ఉపగ్రహాల ప్రయోగంలో నయా రికార్డు

భారతదేశం మాత్రం తన మొట్టమొదటి ఉపగ్రహం 'ఆర్యభట్ట'ను 19 ఏప్రిల్ 1975న నింగిలోకి పంపింది. అయితే భారత అంతరిక్ష శాస్త్రవేత్తల అద్వితీయమైన ప్రతిభాపాటవాలు, నిర్విరామ కృషితో అచిరకాలంలోనే ప్రపంచంలోని మేటి అంతరిక్ష సంస్థలలో ఒకటిగా ఎదిగింది. అంతేకాదు, ఫిబ్రవరి 2017లో భారత అంతరిక్ష సంస్థ ఇస్రో అత్యంత విశ్వసనీయమైన అంతరిక్షనౌక పిఎస్ఎల్విసి37 రాకెట్ ద్వారా ఒకే ప్రయోగంలో 104 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించి ప్రపంచ రికార్డు సృష్టించింది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, రష్యా, అమెరికాలను రెండు, మూడవ స్థానాలకు నెట్టి విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడంలో ఇస్రో అధికారికంగా ప్రపంచంలోనే నంబర్ 1 అంతరిక్ష సంస్థగా అవతరించింది. ఇస్రో సాధించిన ఈ అద్భుతమైన విజయం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో ఉప్పొంగేలా చేస్తూ భారతదేశం ప్రపంచ అంతరిక్ష శక్తి కేంద్రంగా ఎదుగుతోందని మరోసారి రుజువు చేసింది.

## పొదుపైన సంస్థ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగ రంగంలో, ప్రత్యేకించి చిన్న, నానో ఉపగ్రహాలకు సంబంధించి, దాని విశ్వసనీయత, తక్కువ ఖర్చు కారణంగా ప్రపంచంలోనే



ఉపగ్రహ ప్రయోగాలకు పొదుపైన అంతరిక్ష సంస్థగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

**ఏకకాలంలో అత్యధిక ఉపగ్రహాల ప్రయోగంలో ప్రపంచ రికార్డు:** ఒకే ప్రయోగంలో అత్యధిక సంఖ్యలో 104 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించినందుకు ఇస్రో ప్రపంచ రికార్డును కలిగి ఉంది. ఫిబ్రవరి 2017లో, పిఎస్ఎల్విసి37 ద్వారా అత్యధిక ఉపగ్రహాలను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం ద్వారా మునుపటి

94 శాతం కంటే ఎక్కువ విజయాలను సాధించిన ఘనత పిఎస్ఎల్విది. 62 ప్రయోగాలలో 58 విజయవంతం కాగా, (కొన్ని నివేదికలు 60 ప్రయోగాల విజయం ఆధారంగా 97 శాతం అని పేర్కొంటున్నాయి) గతంలో రెండు వైఫల్యాలను మాత్రమే చవిచూసింది. ఇది దాని అధిక విశ్వసనీయత, సమర్థవంతమైన పనితీరు కారణంగా "ఇస్రో శ్రమశక్తి" (ISROes Workhorse) అనే మారుపేరును సంపాదించుకుంది. అంతేకాదు, ఇది వివిధ కక్ష్యలలో ఉపగ్రహాలను ప్రవేశపెట్టడంలో దాని విశ్వసనీయత, బహుముఖ ప్రజ్ఞ కారణంగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా ప్రపంచ చిన్న ఉపగ్రహ ఆపరేటర్లు ఇష్టపడే తక్కువ భూమి, సూర్య సమకాలిక కక్ష్యలు.

## తక్కువ ఖర్చుతో అధిక సామర్థ్యం

ప్రపంచ పోటీదారులైన అమెరికా, రష్యా, యూరోపియన్ సంస్థలతో పోలిస్తే ఇస్రో మిషన్లు వాటి పొదుపైన ప్రయోగాలకు బాగా ప్రసిద్ధి చెందాయి. సహజంగానే తక్కువ ఖర్చుతో, సమర్థవంతమైన పనితీరు, అత్యధిక గత విజయాల చరిత్రతో సేవలు అందిస్తున్న ఇస్రో, ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష ప్రయోగాలకు సిద్ధమయ్యే అభివృద్ధి చెందిన దేశాలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ కంపెనీలకు ప్రాథమిక ఎంపికగా గోచరిస్తుంది.

**పెరిగిన విదేశీ మారకద్రవ్యం:** ఇస్రో వాణిజ్య విభాగం, మొదట ఆంట్రిక్స్ కార్పొరేషన్, ఇప్పుడు న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), వందలాది విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించింది. ఉదా: జనవరి 2015, డిసెంబర్ 2024 మధ్య కాలంలో, ఇస్రో అమెరికా అత్యధిక ఉపగ్రహాలు, యునైటెడ్ కింగ్డమ్,

సింగపూర్ వంటి ప్రధాన భాగస్వాములతో సహా 34 దేశాల నుండి 393 విదేశీ ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించింది. ఈ ప్రయోగాలు భారతదేశానికి గణనీయమైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించిపెట్టింది.

### చిన్న, సూక్ష్మ ఉపగ్రహాల ప్రయోగంపై దృష్టి

ఇటీవలి కాలంలో చిన్న, సూక్ష్మ ఉపగ్రహాల కోసం వేగంగా పెరుగుతున్న మార్కెట్‌పై దృష్టి సారించడం ద్వారా, ఇస్రో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. అంతేకాదు, ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారతదేశం తన వాటాను మరింతగా పెంచుకునేందుకు చురుకుగా పని చేస్తోంది.

చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎస్ఎల్వి) ద్వారా తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన పరిష్కారాలను అందించడం ద్వారా ఇస్రో విలువైన విదేశీ మారకద్రవ్యం గడించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఎస్ఎస్ఎల్వి ప్రత్యేకించి 10 నుండి 500 కిలోల బరువు గల చిన్న ఉపగ్రహాలను తక్కువ భూకక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది. ఎస్ఎస్ఎల్వి ప్రత్యేకించి విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, చిన్న అంతరిక్ష బడ్జెట్‌లు కలిగిన దేశాలతో సహా అంతర్జాతీయ వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తుంది.

సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు గల ఇస్రో ఛైర్మన్లు, డైరెక్టర్ల నేతృత్వంలో, స్వావలంబన, దీర్ఘకాలిక దృక్పథం. వ్యూహాత్మక ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించేలా వ్యూహాన్ని స్థిరంగా అమలు చేయడంతో పాటు నిబద్ధత కలిగిన సిబ్బంది సేవల ఫలితమే ఇస్రో విజయ రహస్యం.

– యేచన్ చంద్రశేఖర్

# కరెంట్ స్తంభాలివి!

హై ఓల్టేజ్ కరెంట్ తీగలు, వాటికి ఆసరాగా ఉండే పొడవాటి కరెంట్ స్తంభాలు ఎక్కడయినా ఒకే మాదిరి ఉంటాయి. అయితే ఆస్ట్రియాలో మాత్రం అలా కాదు. మరి.. అక్కడి ప్రత్యేకత ఏమిటంటారా? ఆస్ట్రియాలో హై-ఓల్టేజ్ కరెంట్ తీగల కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు సాధారణ పోల్స్ లా కాకుండా పెద్ద పెద్ద జంతువుల ఆకృతిలో ఉంటాయి. ఒక కరెంట్ పోల్ దుప్పిలా ఉంటే మరో స్తంభం రెక్కలు విప్పిన పక్షిలా ఉంటుంది. 'ఆస్ట్రియా పవర్ జెయింట్స్' పేరుతో అక్కడి ప్రభుత్వం సృజనాత్మకత, ఇంజినీరింగ్ సామర్థ్యాలని జోడించి కరెంట్ స్తంభాలని స్టీల్‌తో అందమైన ఆకృతులుగా తయారు చేయించారు. పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలిగించకుండా చేసిన ఈ స్తంభాలు సృజనాత్మక రంగంలో ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'రెడ్ డాట్ డిజైన్' అవార్డును అందుకున్నాయి. కరెంట్ స్తంభాలని కళాత్మకంగా తయారు చేయవచ్చని నిరూపించింది ఆస్ట్రియా.



# నీటిపై దీపాలా?

కాలువలు, నదుల అందానికి రాత్రి సమయంలో విద్యుద్దీపాల వెలుగు జత కలిస్తే ఆ అందం ద్విగుణీకృతం అవుతుంది. నెదర్లాండ్స్ లో అలలపైన ఇలాంటి దృశ్యాలు చూడవచ్చు. కానీ అవి విద్యుద్దీపాలు కావు. అవి నాచుదీపాలు.. అదీ ఆశ్చర్యం కలిగించే విషయం. వీటిని సాధారణ విద్యుత్తుతో కాకుండా బయో ఎలక్ట్రిసిటీతో వెలిగిస్తారు.



గాజుసీసాల్లో నాచు, ఎల్ఈడీ లైట్లని ఉంచుతారు. నాచు రాత్రిపూట సూర్యకాంతినీ, కార్బన్‌డైఆక్సైడ్‌ని దాచుకుని దాన్నే రాత్రిపూట ఆ లైట్లు వెలిగించేందుకు దోహదపడతాయి. ఇలా చేయడం వల్ల విద్యుత్తు ఖర్చు తగ్గడంతో పాటు కాంతి కాలుష్యమూ ఉండదని అంటున్నారు. 'పాండ్' ప్రాజెక్ట్ పేరుతో నడుస్తున్న ఈ ఈ నాచు దీపాలు ఇంకో ప్రయోజనం కూడా ఉంది. సాధారణంగా పచ్చగా వెలిగే ఈ దీపాలు రంగు మారుతున్నాయంటే దానర్థం నీటి నాణ్యత తగ్గుతోందని తెలుస్తుంది. తద్వారా అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

# 14 డిసెంబరు, 2025 నుండి 20 డిసెంబరు, 2025 వరకు



## వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం పోటీ పరీక్షలు విజయాన్ని సాధించ గలుగుతారు. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. జీవిత భాగస్వామితో కలిసి ఉండాలని ఆలోచనలు ఏర్పడతాయి. తల్లితరపు బంధువులతో చిన్న గొడవలు సంభవిస్తాయి. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. మీరు చేసిన సహాయము త్యాగాలు కొంతమందికి కానరావు. వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండండి.

### వృషభం

ఈ వారం మీ కష్టసుఖాలను గుర్తించలేని వారిని మీరు కూడా వద్దనుకుంటారు. ప్రయోజనాలు దక్కక పోయినప్పటికీ ఇలాంటి వ్యక్తులతో మనకి సావాసం అవసరం లేదు అన్నట్టుగా మీ ఆలోచనలు ఏర్పడతాయి. కోర్టు తీర్పులు అంతంతమాత్రంగా ఉంటాయి వాయిదాల రూపంలో ఉన్న ఈ విషయాలు ఎన్నో నష్టాలకి అవమానాలు కారణమవుతాయి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి.

### మిథునం

ఈ వారం వ్యాపారాలలో ఆదాయం రొటేషన్ ల రూపంలో ఉంటుంది. కార్యాలయంలో కొంతమంది చేస్తున్న కుట్రలు కుతంత్రాలను బయటకి పడవేయాలని మీరు చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. ఆహార, పానీయాల పట్ల శ్రద్ధ అవసరం. ఆరోగ్య విషయంలో, వాహన విషయంలో నిర్లక్ష్యం తగదు. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి. దూర ప్రయాణాలు కలిసి వస్తాయి.

### కర్కాటకం

ఈ వారం కొన్ని నూతన ఆలోచనలతో ప్రయత్నాలు ప్రారంభిస్తారు. వినోదభరితమైన నటువంటి అంశాల పట్ల ఆకర్షితులవుతారు. కొత్త పెట్టుబడులకు దూరంగా ఉండండి. ఆర్థిక విష వ్యవహారాలలో ఇతరులకు ప్రవేశం కల్పించ వద్దు. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. వాహన ప్రయాణాల విషయంలో అప్రమత్తంగా ఉండండి. ఆహార పానీయాల పట్ల శ్రద్ధ అవసరం.

### సింహం

ఈ వారం సహోదర సహోదరీ వర్గంతో మాట పట్టింపులు ఏర్పడకుండా జాగ్రత్తలు వహించండి. బాధ్యతలను సక్రమంగా నిర్వహించి గలుగుతారు. ముఖ్యమైన శుభకార్యాలు ప్రస్తావనలు విజయవంతంగా జరుగుతాయి. సౌర కంకణాన్ని ధరించండి ఆరోగ్యం మెరుగు పడుతుంది. మీ పేరు మీద ఉన్న స్థిర చరాస్తులు విలువ గణనీయంగా పెరుగుతుంది. కొన్ని సందర్భాలలో వాటిని అమ్మి వేసి మరొకచోట భూములు కొనుగోలు చేయాలి అన్న ఆలోచనలు కలిగి ఉంటారు.

### కన్య

ఈ వారం రెన్యువల్ కోసం దరఖాస్తు దాఖలు చేస్తారు. విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి . వైద్య విద్య పట్ల మక్కువ చూపిస్తారు. రహస్య మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. వాహన ప్రయాణాలలో భద్రత వహించండి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి.

### తుల

ఈ వారం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనగలుగుతారు. కొంతమంది వ్యక్తులు ఆదర్శవంతంగా తీసుకొని మీరు కొన్ని నూతన పనులు ప్రారంభిస్తారు. తరచూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రతిరోజు దేవి దేవతలకు ప్రథమ తాంబూలాన్ని సమర్పించండి. వాహనం నడిపే విషయంలో అప్రమత్తంగా ఉండండి. ఎదుటివారి నిర్లక్ష్యం మనకు ఇబ్బందికరంగా మారు తుంది. శివాలయంలో అభిషేకం జరిపించండి. కొత్త రుణాలు తీసుకోవద్దు.

### వృశ్చికం

ఈ వారం వ్యక్తిగత విషయాలకు ప్రాముఖ్యతనిస్తారు. కొనుగోలుకు అధికంగా ఖర్చు చేస్తారు. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలు పరుస్తారు. యోగాభ్యాసం ప్రకృతి వైద్యం ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. మీ ఇష్ట దేవుళ్లకు మహాతీర్ధం పొడితో అభిషేకం చేయడండి. కుటుంబంలో ఐకమత్యం మానసిక ప్రశాంతతను ఇస్తుంది. వ్యాపారంలో రొటేషన్ లాభాలు బాగుంటాయి.

### ధనస్సు

ఈ వారం జీవిత భాగస్వామితో విభేదాలు ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోండి. ఎన్నో రకాల ప్రయోజనాలను ఆశించి కొంతమంది వ్యక్తులను ఆశ్రయిస్తారు అవి ఫలిస్తాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. అన్ని రకాల వ్యాపారస్తులకి అనుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి. వృత్తిరీత్యా మంచి ప్రోత్సాహాన్ని అందుకో గలుగుతారు. వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండండి.

### మకరం

ఈ వారం మొండి మనుషులను సైతం మార్చగలగుతారు. కార్యాలయంలో మార్పులు ఏర్పడతాయి. వాటిని మీకు అనుకూలంగా మార్చుకోవడానికి మరి కాస్త వ్యవధి పడుతుంది అని గ్రహిస్తారు. రాజకీయ స్నేహాలు బలపడుతాయి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్ధం పొడితో అభిషేకం చేయడండి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. శుభవార్త వింటారు. ఆదాయమార్గాలు తెరుచుకుంటాయి.


### కుంభం

ఈ వారం వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. బాధ్యతలు అధికమవడం వలన శ్రమ అధికంగా ఉంటుంది. ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాలలోనూ అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయండి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండండి. ఎదుటివారి నిర్లక్ష్యం మనకి ప్రమాదంగా మారవచ్చు. బహుమతులు ఇవ్వాలన్న ఆలోచనలు ముడిబడతాయి.


### మీనం

ఈ వారం కీలకమైన సందర్భాలలో అండగా నిలుస్తారని ఆశించిన అయిన వాళ్లు అక్కరకు రాకపోవడం నిష్కారమైన కోపానికి బాధకి కారణమవుతుంది. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రయోజనాలను, ఆదాయాన్ని అందుకోగలుగుతారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

# ఈ వారం కార్టూన్స్


బ్లడ్ సరిగా టెస్ట్ చేసారా? నాకు వేరే బ్లడ్డు పడదు.. తెలుసుగా !!
ఆపరేషన్...


అదృష్టవంతుడివిరా..



నాతో సమానంగా నడవండి.. లేకుంటే 'కూలీ' అనుకుంటారు..!!













ఇందులో
విశేషమేముంది? బీచే కదా!
అని తేలిగ్గా తీసిపారేయకండి.
మెక్సికోలో వున్న ఈ బీచ్‌ను
చూడాలంటే పడవలో వెళ్లాలి మరి.
అరుదైన ఈ బీచ్ మెకియేటాస్ ద్వీపంలో
వుంది. సముద్రం మధ్యలో వుందీ
బీచ్. అదీ దీని ప్రత్యేకత.





